RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 241 ISSUE NO : 241 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శనివారం, మార్చి,21, 2026 Saturday, March,21, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4/-



## యుద్ధ ట్యాంకుపై ఉత్తర కొరియా అధ్యక్షుడు!

### టీనేజ్ కూతురితో పాటూ..

ఢిల్లీ,: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తన కూతురిని రాజకీయ వారసురాలిగా ప్రకటిస్తారన్న వార్తల నడుమ తాజాగా మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల ఉత్తర కొరియా సైన్యం నిర్వహించిన విన్యాసాలకు కిమ్ తన టీనేజ్ కూతురు కిమ్ జూ యేతో కలిసి హాజరయ్యారు.



## ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే ముందుకు

### మీడియతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి


**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఫోన్ ట్యాపింగ్ విషయంలో చట్టప్రకారమే ముందుకు వెళ్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో దర్యాప్తు 20 నెలలు ఆలస్యమైందన్నారు. ఇందులో అరెస్ట్‌లు తప్పవని కూడా అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ దొరికినా.. భాజపా నేతలు మాట్లాడటం లేదని, బీఆర్ఎస్, భాజపా కలిసి ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమని చెప్పారు. ఇకపోతే పదో తరగతి పరీక్షలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఇకపై పదో తరగతి పరీక్షలు లేనట్లే'నని చెప్పారు. ప్రస్తుతం.. దేశమంతా ప్లస్ 2 విధానం అమల్లో ఉందని ప్రస్తావించారు. తమది వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బడ్జెట్ అని వ్యాఖ్యానించారు.



## భద్రాచలంలో.. విషాదం

### గోదావరిలో ఐదుగురు యువకులు గల్లంతు కొనసాగుతున్న గాలింపు చర్యలు

**భద్రాచలం,తెలంగాణ దిశ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో తీవ్ర విషాదం నెలకొంది. శ్రీ సీతారామచంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన ఐదుగురు యువకులు భద్రాచలంలో ఉంటున్న వారిద్దరి స్నేహితులతో కలిసి ఏడుగురు విద్యార్థులు గోదావరి నదిలో స్నానానికి దిగగా అందులో ఐదుగురు విద్యార్థులు గల్లంతయ్యారు. ఈ సంఘటన భద్రాచలం శివా రులోని వేలేరు ప్రాంతంలో చోటుచేసుకుంది. బయటపడ్డ విద్యార్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.



## మలుపులు తిరుగుతున్న ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో పెను సంచలనం సృష్టించిన మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసు ప్రస్తుతం ఒక కీలక మలుపు తిరిగింది. ఈ కేసు లోతుపాతులను వెలికి తీసేందుకు, అంతర్జాతీయ డ్రగ్ మాఫియాతో ఉన్న సంబంధాలను నిగ్గుతేల్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో మార్చి 14 శనివారం రాత్రి పెద్ద ఎత్తున డ్రగ్ పార్టీ జరుగుతోందని పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఈగల్ టీం, స్థానిక పోలీసులు అర్ధరాత్రి సమయంలో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల సమయంలో అక్కడ పది మందికి పైగా వ్యక్తులు ఉన్నారు. పోలీసులను చూడగానే అక్కడ ఉద్రిక్తత నెలకొంది. రోహిత్ రెడ్డి అనుచరులు, ఢిల్లీకి చెందిన రియల్టర్ నమిత్ శర్మ పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారని, రోహిత్ రెడ్డి ప్రోద్బలంతోనే నమిత్ శర్మ గాలిలోకి కాల్పులు జరిపారని పోలీసులు ఈఎఫ్ఐలో పేర్కొన్నారు. ఈ కేసులో పోలీసులు మొత్తం 11 మందిపై ఔఆఖూ చట్టం, ఆర్మ్స్ యాక్ట్, కింద కేసులు నమోదు చేశారు. పైలట్ రోహిత్ రెడ్డిని o1గా చేర్చారు. ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, నమిత్ శర్మలపై కూడా కఠిన చర్యలు తీసుకున్నారు.



## హర్మూజ్ విముక్తికి అమెరికా యత్నాలు

- ఇరాన్ బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం
- యూరోపియన్ దేశాలు సైతం మద్దతు

వాషింగ్టన్/లండన్, మార్చి20 : హర్మూజ్‌పై పట్టుకు అమెరికా యత్నాలు ప్రారంభించింది. ఇరాన్ క్షిపణులను, డ్రోన్లు, బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది. హర్మూజ్ విముక్తికి యూరోపియన్ దేశాలు సైతం మద్దతుగా ముందుకు సాగుతున్నాయి. ప్రపంచ చమురు జీవనాడి హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు కీలక పోరును అమెరికా మొదలు పెట్టింది. ఇందుకోసం తీర ప్రాంతంలో ఇరాన్ మోహరించిన క్షిపణి లాంచర్లు, డ్రోన్లు, బోట్ల వంటి లక్ష్యాలను ఛేదించేందుకు తక్కువ ఎత్తులో ఎగిరే అపాచీ అటాక్ హెలికాప్టర్లు , తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలను రంగంలోకి దింపినట్లు అమెరికా సైనికాధికారులు ఉటంకిస్తూ కథనంలో వెల్లడించింది. అమెరికా చైర్మన్ ఆఫ్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కెయిన్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది.



## భ్రష్టు పట్టించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టింది: బడ్జెట్ పై బండి సంజయ్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంహ్యాట్రిక్ కొట్టిందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడో బడ్జెట్ ప్రవేశపెట్ట డాన్ని ఉద్దేశించి ఆయన అన్నారు. తెలంగాణ బడ్జెట్‌పై ఆయన స్పం దించారు. అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలు తప్ప ఏమీలే దనిఅన్నా రు. ఆదాయాన్ని రాకుండా చేసి, అప్పులకోసం అర్రులు చాచే బడ్జెట్‌గా కనిపిస్తోందని విమర్శించారు. రైతు భరోసా డబ్బులు రెండు విడతలుగా ఎగ్గొట్టినట్లే అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఇప్పటికీ అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యా శాఖ కమిషన్ ప్రతిపాదిస్తే కేవలం8శాతమే కేటాయించారని అన్నారు. ఆరోగ్యశ్రీ బడ్జెట్‌కు కేటాయి ంపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయనిచురక అంటించారు. దేవాదాయ శాఖకు గత బడ్జెట్‌లో రూ. 190 కోట్లు కేటాయిస్తే,ఈసారి ఆ ప్రస్తావన లేదని అన్నారు.

## తెలంగాణ బడ్జెట్ 2026-27

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమా ర్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. రాష్ట్ర బడ్జెట్ మొత్తం విలువ రూ.3,24,234 కోట్లుగా ఆయన వెల్లడించారు. రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లుగా, మూలధన వ్యయం రూ.47, 267 కోట్లు, తలసరి ఆదాయం రూ.4,18,931 కోట్లుగా పేర్కొన్నారు. రాష్ట్ర వృద్ధి రేటు 10.2 శాతమని ప్రకటించారు. ఈ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖకు 26,674 కోట్లు, వ్యవసాయ శాఖకు 23,179 కోట్లు, విద్యుత్ శాఖకు 21,285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు 7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు 1,529 కోట్లు, వైద్య శాఖకు 13,679 కోట్లు, కార్మిక శాఖకు 998 కోట్లు, పర్యాటక రంగానికి 1,224 కోట్లు, మహిళా శిశు సంక్షేమ శాఖకు 3,143 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.7,937 కోట్లు, బీసీ సంక్షేమానికి 12,511 కోట్లు, మైనారిటీ సంక్షేమానికి రూ.3,769 కోట్ల చొప్పున కేటాయించారు. అదేవిధంగా పట్టణాభివృద్ధి, పురపాలక శాఖకు రూ.17,907 కోట్లు, న్యాయశాఖకు రూ.2,367 కోట్లు, రవాణా శాఖకు రూ.12,759 కోట్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు రూ.33,688 కోట్లు, ఐటీ శాఖకు రూ.875 కోట్లు, పరిశ్రమల శాఖకు రూ.3,490 కోట్లు, చేనేతకు రూ.258 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.7,430 కోట్లు, సాగునీటి ప్రాజెక్టులకు రూ.22,615 కోట్లు, రాజీవ్ యువ వికాసానికి రూ.6 వేల కోట్లు, శాంతిభద్రతలకు రూ.11,907 కోట్లు, గోదావరి పుష్కరాలకు రూ.500 కోట్ల చొప్పున కేటాయించినట్లు భట్టి తెలిపారు.



### రూ. 3.24 లక్షల కోట్లతో సంక్షేమం, అభివృద్ధి

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



## ఇరాన్‌తో యుద్ధం ఎప్పుడు ముగుస్తుంది?

### ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

ఇజ్రాయెల్ : ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్‌ల యుద్ధంతో మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్త నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ యుద్ధం నేపథ్యంలో చాలా దేశాల్లో ఇంధన సరఫరాపై ఆందోళనలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే చాలా దేశాలు ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందా? అని చూస్తున్నాయి. అయితే ఇలాంటి పరిస్థితుల వేళ ఇరాన్‌తో యుద్ధం ముగింపుపై ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ యుద్ధం ప్రజలు అనుకుంటున్న దానికంటే త్వరగా ముగియవచ్చని తాను నమ్ముతున్నట్లు తెలిపారు.

## కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యం



**కుషాయిగూడ, మార్చి 20, (తెలంగాణ దిశ) :** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ మేరకు భర్త ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జున నగర్ కాలనీ చెందిన గోపరాజు మహేష్ (33), ప్రైవేట్ టీచర్గా పనిచేస్తున్నాడు. అతనికి 2022 సంవత్సరంలో వరంగల్కు చెందిన గోపరాజు మానస (25)తో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వివాహానంతరం వీరు గత నాలుగేళ్లుగా నాగార్జున నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 7.40 గంటలకు మహేష్ ఉద్యోగ రీత్యా సీబీఎస్ఈ పేపర్ కరెక్షన్ పనుల కోసం హిమాయత్నగర్కు వెళ్లాడు. అదే రోజు సాయంత్రం 6.30 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చి చూడగా భార్య మానస ఇంట్లో కనిపించలేదని గుర్తించాడు. అనంతరం చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. గతంలో కూడా ఆమె తన తల్లిదండ్రుల ఇంటి వద్ద నుంచి వెళ్లిపోయిన సందర్భంలో వరంగల్లోని ఇంతేజార్గంజ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు వెతికి అప్పగించినట్లు భర్త ఫిర్యాదులో పేర్కొన్నాడు. ప్రస్తుతం ఇంటి నుంచి వెళ్లిపోవడం ఇది రెండవ సారని తెలిపారు. అదృశ్యమైన మహిళ వివరాలు ఇలా ఉన్నాయి. ఎత్తు సుమారు 4.5 అడుగులు, చామనచాయ వర్ణం, కుడిచేతి మోచేతి వద్ద కాలిన మచ్చ ఉంది. చివరిసారిగా పసుపు రంగు పంజాబీ డ్రెస్ ధరించి ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కుషాయిగూడ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కాప్రా ప్రెస్ క్లబ్ లో ఘనంగా ఉగాది పంచాంగ శ్రవణం

### ఉగాది పురస్కారం కింద 23 మంది జర్నలిస్టులకు ఒక్కొక్కరికి రూ. 2016 నగదు పంపిణీ






**కాప్రా,మార్చి 20, (తెలంగాణ దిశ) :** కాప్రా ప్రెస్ క్లబ్ లో గురువారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత క్లబ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు శ్రీధర్ పంతులు ఉగాది పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఉగాది సందర్భంగా క్లబ్ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 2016 నగదు పురస్కారాన్ని అందజేయడం జరిగింది. మొత్తం 23 మంది సభ్యులకు రూ. 46,368 నగదు అందజేయడం జరిగింది. క్లబ్ సభ్యులందరికీ ప్రతినెల ఈఎస్ఐ ప్రీమియం క్లబ్ ఆధ్వర్యంలోనే చెల్లించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ సలహాదారులు బెలిదే అశోక్, అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి రామచంద్రమూర్తి, ఉపాధ్యక్షులు యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్ రావు, గార్లపాటి శ్రీనివాస్ రావు, గోవిందుకుంట్ల ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు పటేల్ నరసింహ, మాజీ కోశాధికారి యాటరాజు తదితరులు పాల్గొన్నారు.





### విపంచి ఫౌండేషన్ ఉగాది పురస్కారానికి

## సీనియర్ జర్నలిస్ట్ రమేష్ ఎంపిక

### ఈ నెల 23 న రవీంద్రభారతి లో ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారం

**విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్**



**కుత్బుల్లాపూర్, మార్చి 20, (తెలంగాణ దిశ):** గత కొన్ని సంవత్సరాలుగా సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలలో కృషి చేస్తున్న విపంచి ఫౌండేషన్ ప్రతీ ఏటా ఇచ్చే ప్రతిష్ఠాత్మక పురస్కారానికి సీనియర్ జర్నలిస్ట్ టి. రమేష్ ను విపంచి ఫౌండేషన్ ప్రత్యేక జూరీ కమిటీ ఎంపిక చేసింది. పత్రికా రంగంలో రమేష్ చేస్తున్న కృషికి గాను ఈ అవార్డును ప్రకటిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. యాదాద్రి జిల్లా ఆత్మకూరు (ఎం)కు చెందిన రమేష్ భువనగిరిలోని డిగ్రీ చదువుకున్న సమయం నుంచే జర్నలిజంపై ఆసక్తితో పలు పత్రికలో స్థానిక సమస్యల స్పందిస్తూ సుమారు 30 సంవత్సరాల నుండి సాహిత్య పరిశోధక వ్యాసాలతో తెలుగు భాషా సాహిత్యానికి తనవంతు సేవలు అందిస్తున్నాడని అన్నారు. చిన్న వయస్సులోనే సాహితీ మాగాణంలో చెరగనిముద్రను వేసుకున్నాడని తెలిపారు. ప్రస్తుతంకుత్బుల్లాపూర్ నియో జకవర్గంలో జర్నలిస్ట్ గా పనిచేస్తున్నారన్నారు. భవిష్యత్ లో మరిన్ని రచనలు చేసి తెలంగాణకు మరింత ఖ్యాతిని తీసుకురావాలని కాంక్షించా రు. ఈనెల 23న సోమవారం రోజున రవీంద్ర భారతిలో ఈ పురస్కారా న్ని ప్రదానం చేయనున్నట్లు విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ తెలిపారు.

తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రముఖులు హాజరవుతారని సమన్వయకర్తలు తెలిపారు.

### ప్రజా పాలన--పట్టణ ప్రగతిలో భాగంగా

## కాప్రా సర్కిల్ లో విస్తృత శుభ్రత పనులు




**కాప్రా, మార్చి 20, (తెలంగాణ దిశ):** ప్రజా పాలన, పట్టణ ప్రగతి 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తా నుండి సైనిక్పురి చౌరస్తా వరకు ప్రధాన రహదారిపై విస్తృత శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారికి ఇరువైపులా పేరుకు పోయిన చెత్తాచెదారంతో పాటు సెంట్రల్ మెరీడియన్లో ఉన్న చెత్త, పిచ్చి మొక్కలు, గడ్డి, మట్టి, రాళ్లను శానిటేషన్ సిబ్బంది ప్రత్యేక యంత్రాలు, బాబ్క్యాట్ వాహనాల సహాయంతో తొలగించారు. రోడ్డును కప్పివేసిన మట్టిపొరలను కూడా పూర్తిగా శుభ్రం చేశారు. అదేవిధంగా రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్స్ను కూడా తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి మాట్లాడుతూ ప్రజా పాలన, పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా సర్కిల్ లోని ప్రధాన రహదారులు, కాలనీలను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణం కల్పించడం కోసం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. పరిశుభ్రత పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ సూపర్ వైజర్ సుదర్శన్ జవాన్ రామకృష్ణ, సుధీర్, శ్రీనివాస్ ఎస్ఎఫ్ఏ వసంత, శిరీష, కుమార్, రాంకీ సర్కిల్ ఇంచార్జీ నవీన్ కుమార్ రెడ్డి, సూపర్ వైజర్ శృతి పాల్గొన్నారు.



## హెచ్బీ కాలనీలో బీజేపీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**హెచ్బీ కాలనీ, మార్చి 20, (తెలంగాణ దిశ):** ఉప్పల్ నియోజకవర్గం హెచ్బీ కాలనీ డివిజన్లో బీజేపీ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినంతో పాటు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేపీ డివిజన్ ఫౌండర్ కంచర్ల గోపాల్ రెడ్డి గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ హెచ్బీ కాలనీ డివిజన్ అధ్యక్షులు రామ్ ప్రదీప్ మునిగంటి మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉగాది పర్వదినాన్ని దృష్టిలో ఉంచుకొని చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలను ముందుండి నిర్వహిస్తారని తెలిపారు. అదే విధంగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




### జై జవాన్ కాలనీ శ్రీ విజయదుర్గా మల్లేశ్వరాలయంలో

## ఘనంగా ఉగాది వేడుకలు

### ముఖ్యఅతిథిగా హాజరైన హంపి పీఠాధిపతి శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి

### ఆశీర్వాదం తీసుకున్న మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు






**ఏఎస్ రావునగర్, మార్చి 20, (తెలంగాణ దిశ) :** ఏఎస్ రావునగర్ డివిజన్ జై జవాన్ కాలనీలోని శ్రీ విజయ దుర్గ మల్లేశ్వరాలయంలో ఉగాది పండుగ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం ఆలయంలో జరిగిన మహోత్సవాలకు శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానం పీఠాధిపతి శ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి విచ్చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే పరాభావ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని పంచాంగాన్ని చదివి భవిష్యత్తు కాలాన్ని భక్తులకు తెలియజేశారు. ఈ మహోత్సవాలకు విచ్చేసిన మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు పూజా కార్యక్రమాలను తిలకించి హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా కొత్త రామారావు ఆలయంలోని దేవతామూర్తులను దర్శించుకుని మాట్లాడారు. ఉగాది పర్వదినాన హంపి పీఠాధిపతి పంచాంగాన్ని వినటం, ఆయన ఆశీర్వాదాన్ని తీసుకోవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భక్తులకు హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి దర్శన అవకాశం కల్పించిన ఆలయ కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇక ఉగాది మహోత్సవాలతో ఆలయంలో భక్తులతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, ఆలయ కమిటీ అధ్యక్షుడు రంగ స్వామి, ఉపాధ్యక్షుడు డి. శ్రీహరి, కార్యదర్శి ఉపేందర్ రెడ్డి, వాసు, రాజు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గీతాంజలి కళాశాలలో 24 గంటల జాతీయ స్థాయి హ్యాకథాన్ సక్సెస్





**కీసర, మార్చి 20, (తెలంగాణ దిశ) :** గీతాంజలి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో "టెక్సినాప్స్" పేరుతో 24 గంటల జాతీయ స్థాయి హ్యాకథాన్ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా 35కు పైగా కళాశాలల నుండి సుమారు 400 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ విభాగాలకు చెందిన యువత, ఆవిష్కర్తలు, విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శిస్తూ కార్యక్రమాన్ని అత్యంత ఉత్తేజ భరితంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెఎన్ టియూహెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి. కిషెన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశ్రమల అవసరాలు, సామాజిక సమస్యల పరిష్కారాలతో అనుసంధానం చేయడం నేటి తరానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. గీతాంజలి కళాశాలలో ఇలాంటి జాతీయ స్థాయి హ్యాకథాన్ నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. యువతలో ఆవిష్కరణాత్మక దృక్పథాన్ని పెంపొందించే వేదికగా ఇది నిలుస్తుందని ఆయన అన్నారు. హ్యాకథాన్లో పాల్గొన్న బృందాలు సమాజం ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలకు సాంకేతిక ఆధారిత పరిష్కారాలను ప్రతిపాదించాయి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన పలు వినూత్న ప్రాజెక్టులు న్యాయనిర్ణేతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ప్రాజెక్టులను ప్రముఖ పారిశ్రామిక, సాంకేతిక సంస్థలకు చెందిన నిపుణులు సమీక్షించారు. 'స్వేచ్ఛ', 'నాక్ల్యాబ్స్', 'అవిన్య న్యూరోటెక్' టై హైదరాబాద్కు చెందిన జ్యూరీ, మెంటార్ సభ్యులు పాల్గొని విద్యార్థుల ఆలోచనలను పరిశీలించారు. అలాగే, ప్రాజెక్టుల మెరుగుదలకు అవసరమైన విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు.

ఈ హ్యాకథాన్ ద్వారా విద్యార్థులకు తమ ప్రతిభను జాతీయ వేదికపై చాటుకునే అవకాశం లభించడమే కాకుండా, పరిశ్రమల దృక్కోణంలో ఆలోచించే నైపుణ్యాలు కూడా పెంపొందినట్లు కళాశాల వర్గాలు పేర్కొన్నాయి. సాంకేతిక విద్యకు ఆవిష్కరణాత్మక దిశను చూపించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె సాగర్ డైరెక్టర్ డాక్టర్ సుసర్ల ఉదయ్ కుమార్ వైస్ చైర్మన్ హరీష్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## అంతులేని కథ..!

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం సెగలు ఇప్పుడు ఒక్కొక్క దేశాన్ని తాకుతున్నాయి.. అమెరికాలో సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసులోని రహస్య పత్రాలను 'ఎప్‌స్టీన్ ఫైల్స్' అంటున్నారు. ఇటీవల అమెరికా ప్రభుత్వం ఈ పత్రాలను బహిర్గతం చేయడంతో ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఎప్‌స్టీన్ అమెరికన్ బిలియనీర్. మైనర్ బాలికలను లైంగిక అక్రమ రవాణా చేసినట్లు నిర్ధరణ అయింది. 2019లో ఎప్‌స్టీన్ జైలులో ఉండగానే ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సేకరించిన కోర్టు పత్రాలు, సాక్ష్యాలు, విమాన ప్రయాణ వివరాలు, కాంటాక్ట్ లిస్టులను ప్రభుత్వం విడతల వారీగా విడుదల చేస్తూ వస్తోంది.అమెరికా, బ్రిటన్ ఇలా ఎన్నో దేశాలను వణికిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లోని కుబేరుల్ని సైతం షేక్ చేస్తున్న అంశం ఎప్‌స్టీన్ ఫైల్స్. చాలా ఏళ్లుగా ఈ విషయంలో చర్చ జరుగుతూనే ఉన్న.. ఇటీవల వరుసగా ఇందులోని విషయాలు బయటకు వచ్చాయి. అప్పటివరకు వీటి గురించి బహిరంగంగా మాట్లాడని సెలబ్రిటీలు, సెలబ్రిటీలు భార్యలు కూడా ఇప్పుడు మాట్లాడుతున్నారు. ఇప్పుడు ఈ రొచ్చు బాలీవుడ్‌కి తాకింది. హిందీ సినిమాకు చెందిన ఇద్దరి పేర్లు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్నాయంటూ ప్రచారం జరుగుతోంది. వారే దర్శక నటుడు అనురాగ్ కశ్యప్, దీపక్ చోప్రా. దీంతో ఇప్పుడు బాలీవుడ్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఓ ఈవెంట్ కోసం అనురాగ్ కశ్యప్ 2017లో బీజింగ్ వెళ్లారంటూ పుకార్లు వచ్చాయి. వీటిపై అనురాగ్ కశ్యప్ స్పందించి ఖండించారు. "వక్తగా నాకు నెలకు చాలా ఆహ్వానాలు వస్తుంటాయి. అరుదుగా వాటిపై స్పందిస్తుంటా. అయితే నా జీవితంలో ఇప్పటివరకూ బీజింగ్ వెళ్లలేదు" అని క్లారిటీ ఇచ్చేశారు. ఇక దీపక్ చోప్రా మాట్లాడుతూ నేనెప్పుడూ నేరపూరిత కార్యకలాపాల్లో భాగం కాలేదు. ఎప్‌స్టీన్‌తో నా పరిచయం పరిమితమైనది. వివాదాస్పద లైంగిక నేరాల ఘటనతో నాకు సంబంధం లేదు అని చెప్పేశారు.అయితే ఈ పత్రాల్లో ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తుల పేర్లు ఉండటం కలకలం రేపుతోంది. అయితే, ఒక వ్యక్తి పేరు ఈ ఫైల్స్‌లో ఉన్నంత మాత్రాన అతను నేరం చేసినట్లు కాదు. కొందరు కేవలం ఆయనకు తెలిసిన వారు, లేదంటే ఆయన విమానంలో ప్రయాణించిన వారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఫైల్స్‌ను పూర్తిగా విడుదల చేసేందుకు ఉద్దేశించిన బిల్లుపై ఇటీవల సంతకం చేశారు. దీనివల్ల దాదాపు 30 లక్షల పేజీల డాక్యుమెంట్లు, 2 వేల వీడియోలు బయటకు వచ్చే అవకాశం ఉంది. అప్పుడు ఇంకా చర్చ జరుగుతుం ప్రభుత్వాన్ని తాకాయి. ఇప్పటికే ఎప్‌స్టీన్‌తో సంబంధాలపై బిల్‌గేట్స్ స్పందించి.. బాధితులకు క్షమాపణలు చెప్పగా.. ఇప్పుడు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అందరికీ సారీ చెప్పారు. ముఖ్యంగా ఎప్‌స్టీన్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పీటర్ మాండెల్సన్‌ను గతంలో అమెరికాకు బ్రిటన్ రాయబారిగా నియమించినందుకుగాను ఆయన పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఎప్‌స్టీన్ బాధితులకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ క్షమాపణలు తెలిపారు.అమెరికాలో బ్రిటన్ రాయబారి వంటి అత్యంత కీలకమైన పదవిని పీటర్ మాండెల్సన్‌కు కట్టబెట్టడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే మాండెల్సన్ తనవద్ద అబద్ధాలు చెప్పి ఆ పదవిని దక్కించుకున్నారని ప్రధాని కీర్ స్టార్మర్ ఆరోపించారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ తనకు అంతగా పరిచయం లేని వ్యక్తి అని, అతనితో ఎలాంటి లోతైన సంబంధాలు లేవని మాండెల్సన్ నమ్మించారని ప్రధాని వెల్లడించారు. ఆయన మాటలను నమ్మి చేసిన నియామకం ఇప్పుడు ప్రభుత్వానికి తలవంపులు తెచ్చిందని స్టార్మర్ అంగీకరించారు.పీటర్ మాండెల్సన్ 2024 డిసెంబరులో రాయబారిగా బాధ్యతలు చేపట్టారు. అయితే 2008లోనే ఎప్‌స్టీన్ లైంగిక నేరాల కేసులో దోషిగా తేలినప్పటికీ.. మాండెల్సన్ ఆయనతో స్నేహాన్ని కొనసాగించినట్లు కొన్ని ఈమెయిల్స్, మరికొన్ని పత్రాలు బయటకు వచ్చాయి. ఇలా వీరిద్దరి మధ్య ఉన్న సంబంధంలోని చీకటి కోణాలు వెలుగులోకి రావడంతో స్టార్మర్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే గతేడాది సెప్టెంబరులో ప్రధాని కీర్ స్టార్మర్ పీటర్ మాండెల్సన్‌ను పదవి నుంచి తొలగించారు.అమెరికా ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మరిన్ని పత్రాలు మాండెల్సన్ చుట్టూ ఉచ్చును మరింత బిగించాయి. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం సమయంలో బ్రిటన్ ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని అత్యంత సున్నితమైన సమాచారాన్ని మాండెల్సన్ ఎప్‌స్టీన్‌తో పంచుకున్నట్లు ఈ పత్రాలు తెలుపుతున్నాయి. దేశ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఒక లైంగిక నేరగాడితో సమాచారాన్ని పంచుకోవడం బ్రిటన్ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. కేవలం స్నేహం మాత్రమే కాకుండా.. వీరి మధ్య ఆర్థిక లావాదేవీలు కూడా జరిగినట్లు ఆధారాలు లభ్యం అయ్యాయి.2003-2004 మధ్యకాలంలో పీటర్ మాండెల్సన్, ఆయన భాగస్వామి రీనాల్డో అవిలా ద సిల్వాకు సంబంధించిన బ్యాంకు ఖాతాలకు ఎప్‌స్టీన్ సుమారు 75 వేల డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 63 లక్షలకు పైగా) మేర చెల్లింపులు చేశాడని వెల్లడి అయింది. ఇంతటి నేర చరిత్ర ఉన్న వ్యక్తితో ఆర్థిక సంబంధాలు కలిగి ఉండి కూడా, రాయబారిగా కొనసాగడం బాధితులను మరింత ఆవేదనకు గురిచేసిందని ప్రధాని పేర్కొన్నారు.ఎప్‌స్టీన్ ఫైళ్లలో విడుదలైన నగ్న ఫోటోలు, వీడియోలు బ్లర్ చేయకుండా చాలా రోజులుగా ఆన్‌లైన్‌లో ఉన్నాయి. ఈ తప్పు గురించి అమెరికా అధికారులను ముందే హెచ్చరించినా, ఆ కంటెంట్ కొన్ని రోజుల పాటు ఆన్‌లైన్‌లోనే ఉండిపోయింది. దీంతో బాధితులకు భర్తీ చేయలేని నష్టం కలిగింది' అని న్యాయవాదులు అంటున్నారు.ఎప్‌స్టీన్ బాధితులైన అనేక మందిని గుర్తించగలిగే సమాచారం కలిగిన వేలాది పత్రాలలో భాగమని న్యాయవాదులు చెబుతున్న ఫైల్స్‌ను వెరిఫై పరిశీలించింది.ఎప్‌స్టీన్ ఫైళ్లలో భాగంగా దాదాపు 40 వేర్వేరు చిత్రాలు ప్రచురించారని న్యూయార్క్ టైమ్స్ శుక్రవారం రిపోర్ట్ చేసినటప్పుడు బాధితుల సంఘాలు మొదట ఈ విషయం గురించి మాట్లాడాయి.బాధితులు పేర్లు, చిత్రాలను సరిగ్గా సవరించే వరకు వెబ్‌సైట్‌ను మూసివేయాలని కోరిన తర్వాత, సమస్యను త్వరగా పరిష్కరించేందుకు న్యాయశాఖ అంగీకరించిందని మంగళవారం న్యూయార్క్ జడ్జ్ ఒకరు తెలిపారు."సాంకేతిక లేదా మానవ తప్పిదం" కారణంగా ఫైల్స్ అప్‌లోడ్ అయ్యాయని పేర్కొంటూ, న్యాయశాఖ తన వెబ్‌సైట్ నుంచి వేలాది పత్రాలను తొలగించింది . కొత్త అభ్యర్థనలను పరిశీలిస్తూనే ఉందని, అలాగే తదుపరి సవరణ అవసరమయ్యే ఇతర పత్రాలు ఏవైనా ఉన్నాయా అని తనిఖీ చేస్తున్నట్టు ఆ విభాగం తెలిపింది.అంతకుముందు రోజే రిడక్షన్ లోపాలను సరిచేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, బుధవారం కూడా చాలా చిత్రాలు ఆన్‌లైన్‌లో ఉన్నాయని వెరిఫై గుర్తించింది. ఈ విషయంపై స్పందన కోసం న్యాయశాఖను సంప్రదించింది బీబీసీ వెరిఫై. రిడక్షన్ చేయని ఫైళ్ల పేర్లను కూడా ఇచ్చింది."జరిగిన నష్టం పూడ్చలేనిది" అని బాధితుల తరపు న్యాయవాది బ్రాడ్ ఎడ్వర్డ్స్ ఒక ప్రకటనలో తెలిపారు.వెరిఫై గుర్తించిన నాలుగు చిత్రాలలో పాక్షికంగా దుస్తులు ధరించిన యువతుల ముఖాలు, శరీరాలు బ్లర్ చేయకుండా కనిపించాయి.ప్రముఖులతో ఎప్‌స్టీన్ సంభాషణలకు సంబంధించిన ఆధారాల కోసం విడుదల చేసిన లక్షల కొద్దీ ఫైళ్లను సాధారణంగా శోధించినప్పుడు అవి కనిపించాయి.కొన్ని పత్రాలలో కొంతమంది ఫోటోలను తొలగించినట్లు కనిపిస్తోంది. కానీ మరోచోట తొలగించలేదు.

# కూచిపూడి నా భాష





ఆమె పుట్టింటి చిరునామా కూచిపూడి. ప్రఖ్యాత కూచిపూడి కళాకారులు రాజారెడ్డి గారాలపట్టి యామిని రెడ్డి. బుడిబుడి అడుగుల నాడే జతులు నేర్చింది. ముద్రలు తనకు వెన్నతో పెట్టిన విద్య. వారసత్వంగా నాట్యకళలోకి అడుగుపెట్టింది. ఇప్పుడు ప్రయోగాలతో కూచిపూడికి ఆదరణ తెస్తున్నది. హిందుస్థానీ రాగాలపై కూచిపూడిలో నర్తించి ఉత్తరాదినీ మెప్పిస్తున్నది. సౌరమండల విశేషాలు మేళవించి 'సూర్య త్వం సూర్య ప్రణమామ్యహం'తో రంగస్థలంపై వైజ్ఞానిక ప్రదర్శన గావించింది. కూచిపూడిని ఎల్లలు దాటించడమే కాదు, ఈ నాట్యకళను నేటితరానికి చేరువ చేయడానికి ప్రయోగాలు అవసరమే అంటున్న యామిని రెడ్డి జిందగీతో పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..

త్యాగయ్య, అన్నమయ్య రాసిన కీర్తనలు వాళ్ల కాలానికి కొత్తవి. అవి ఓ ప్రయోగం. ఈ రోజుల్లో వస్తున్న కథల్లో భాష వేరు. ప్రాచీన రచనలు, పాతకథల్లో భాష వేరుగా ఉంది. కాలానుగుణంగా భాష అనేక మార్పులకు లోనవుతుంది. సాహిత్యం, నాటకం కాలానికి తగినట్టుగా కొత్త రూపాలు తీసుకుంటున్నాయి. కానీ, తరతరాల కూచిపూడి.. ఈ తరం కోసం ఏమన్నా మారిందా? మాకంటే ముందున్న కూచిపూడి కళాకారులు ఎన్నో ఏండ్ల నుంచి అవే ప్రదర్శిస్తున్నారు. చిన్నప్పటి నుంచి అవే చూస్తున్నా. అందంగా ఉన్నాయి. కానీ, కొత్తదనం లేదనిపించింది. కొత్త తరం కోసం మార్పును ఆహ్వానించాలి అనిపించింది.

**శతకోటి సూర్యప్రభ:** కొత్త ప్రయోగాలు చేయాలనిపించే వయసు నాది. ఈ కాలానికి తగ్గట్టు కూచిపూడిని కొత్తగా చూపించాలనుకున్నాను. దాని కోసం ఏం చేయగలుగుతామని ఆలోచించాను. కూచిపూడి నా భాష. ఆ భాషలో కొత్తదనమే.. వైజ్ఞానికమైన ఆలోచనలతో రూపొందిన 'సూర్య త్వం సూర్య ప్రణమామ్యహం' ప్రయోగం. సౌర వ్యవస్థ గురించి మనమంతా చదువుకున్నాం. మన పురాణ గ్రంథాల్లోని నవగ్రహాల ప్రస్తావనలున్నాయి. ఈ తరం కోసం.. కూచిపూడి ప్రదర్శన ద్వారా నవగ్రహాలకు సూర్యుడు కేంద్రమని, ప్రకృతికి వెలుగు సూర్యుడేనని, ఈ వెలుగు లేకుంటే ఈ ప్రకృతి అందాలు చూడలేమని, మన జీవితమూ లేదని చెప్పాం. దీనికి నేనే కొరియోగ్రఫీ చేశాను. పాతికమంది కళాకారులతో అద్భుతంగా ప్రదర్శించాం!

**హిందుస్థానీ ఆస్థానంలో:** చిన్నప్పుడు మా అమ్మానాన్న హిందుస్థానీ స్వరాలకు కూచిపూడి ప్రదర్శనలు చేశారు. పండిట్ రవిశంకర్ స్వరకల్పనకు ఓ ప్రదర్శన ఇచ్చారు. అమ్మానాన్న చేసే ఇలాంటి ప్రయోగాల్లో నేనూ చేరాను. అవన్నీ పది నిమిషాలు, పదిహేను నిమిషాల ప్రదర్శనలే. పూర్తి స్థాయి ప్రదర్శన జరగలేదు. గతేడాది ఆగస్టులో ఓ అడుగు ముందుకేసి ఢిల్లీ వేదికపై 'కూచిపూడి కీ షామ్ హిందుస్థానీ కే నామ్' పేరిట ఓ ప్రదర్శన ఇచ్చాను. ఇదో ప్రయోగం. హిందుస్థానీ స్వరకల్పనకు కూచిపూడి నృత్యం చేస్తే.. కూచిపూడి అందం ఉంటుందా, పోతుందా? అని సందేహం వచ్చింది. కానీ, హిందుస్థానీ రాగంపై కూచిపూడి ప్రదర్శనను గంటన్నరపాటు ఆహుతులంతా ఆస్వాదించారు. రెండు మహానదులు సంగమించినట్టు అనిపించిందని చాలామంది అన్నారు. సంగీతం, నాట్యం రెండూ బాగా సరిపోయాయని అందరూ మెచ్చుకున్నారు. దీంతో కూచిపూడిని ఇతర ప్రాంతాలకూ పరిచయం చేయొచ్చని అర్థమైంది.

**అంతరాలకు వారధి కట్టానిలా..:** ఢిల్లీలో కూచిపూడి నేర్చుకునేవాళ్లలో కొంతమంది వాళ్ల పిల్లలకు హిందుస్థానీ ట్యూన్స్‌తో కొంతైనా నేర్పమని కోరారు. కూచిపూడికి కర్ణాటక సంగీతం ఆత్మ. ఈ సంగీతానికి భాష తెలుగు, తమిళం, సంస్కృతాలు. నార్త్ ఇండియాలో కూచిపూడికి ప్రాచుర్యం తీసుకురావాలంటే వాళ్లకు అర్థమయ్యే భాషలో ప్రదర్శన చేయాలి అనిపించింది. అప్పుడే ఈ కళకు మరింత ఆదరణ దక్కుతుంది. కూచిపూడి కళాకారులకు కర్ణాటక సంగీతం తెలిసి ఉండటం అవసరమని మా అమ్మలు రాధా రెడ్డి, కౌలస్యా రెడ్డి చెప్పారు. ఢిల్లీలో కూచిపూడి నేర్చుకుంటూనే కర్ణాటక సంగీతం కూడా నేర్చుకున్నాను. నేను ఢిల్లీలో పుట్టి, పెరిగాను కాబట్టి హిందుస్థానీ సంగీతంపై అవగాహన ఉంది. మా పేరెంట్స్ ఇలాంటి ప్రయోగాలు చేయడం వల్ల రెండిటినీ ఎలా మేళవిస్తారో చూశాను. ఆ అనుభవంతోనే హిందుస్థానీ రాగాలకు కూచిపూడి నృత్యార్చన చేశాను. హిందుస్థానీ గాయకురాలు అదితి శర్మ గార్గ్ గాత్ర దానం చేశారు. ఈ ప్రదర్శన కోసం హిందుస్థానీ ధృపద్ ఎంచుకున్నాను. దీనిలో రిథమ్ ఎక్కువగా ఉంటుంది.

కూచిపూడికి అనువుగా ఉంటుంది. ఇందులో గమకాలు అధికంగా ఉంటాయి. అదితి మాతో ఇరవై ఏళ్ల నుంచి కలిసి పనిచేస్తున్నది. తనకు కూడా కూచిపూడిపై అవగాహన ఉంది. హిందుస్థానీ రాగాలే అయినా.. తాళం, జతులు కూచిపూడికి సరిపోయేలా సిద్ధం చేశాం. ఇలా నాట్యానికి తగ్గట్టుగా గీతాన్ని తీర్చిదిద్దాం. ఈ మేళవింపు అందరి ప్రశంసలూ అందుకుంది.

**అమ్మ వద్దన్నదే కావాలనుకున్నా:** కూచిపూడిని కెరీర్‌గా ఎంచుకోవద్దని అమ్మ చెప్పేది. ఆర్టిస్ట్ జీవితంలో చాలా పోరాటం ఉంటుంది. అది వాళ్లకు అనుభవం. కాబట్టి తన పిల్లలకు ఆ కష్టాలు వద్దనుకుంది. ఉద్యోగమైతే భద్రత ఉంటుందని చెప్పింది. నేను డాక్టర్ కావాలని అమ్మ కోరుకునేది. బయాలజీ నాకు ఇష్టమైన సబ్జెక్ట్. బైపీసీలో చేరాలని అనుకున్నా. మెడిసిన్ చదివితే నాట్యానికి దూరమవుతానని భయపడ్డా. అందుకే కామర్స్ తీసుకున్నా. కామర్స్ చదువుతూ కూచిపూడి నేర్చుకున్నా. అమ్మ చదువుకోవాలని చెప్పేది. తనను సంతోష పెట్టడానికే ఎంబీఏ ఫైనాన్స్‌లో చేరాను. చదువు అయిపోగానే జాబ్ చేయనని చెప్పాను. డ్యాన్సే నా కెరీర్ అన్నాను. 'సరే నీ ఇష్ట'మన్నారు.

**నా నాట్య తరంగిణి:** మా అత్త గారిది హైదరాబాద్. బిజినెస్ ఫ్యామిలీ. పెళ్లి నాటికే డ్యాన్స్ కెరీర్‌లో బిజీగా ఉన్నాను. ఇక్కడంతా కొత్త. ఏం చేయాలో అర్థమవ్వలేదు. డ్యాన్స్ నాకు ఎంత ఇష్టమో మా ఆయనకు కూడా అంతే ఇష్టం. నా ఇష్టానికి సపోర్ట్‌గా ఉన్నారు. 'నువ్వు చిన్న డ్యాన్స్ స్కూల్ పెట్టుకో. నలుగురికి డ్యాన్స్ నేర్పించవచ్చు. బిజీగా ఉంటావు. సంతోషంగానూ ఉంటావు' అని మా ఆయన సలహా ఇచ్చారు. ఇంట్లోనే కూచిపూడి శిక్షణ మొదలుపెట్టాను. నలుగురు స్టూడెంట్స్‌తో నా 'నాట్య తరంగిణి' మొదలైంది.

**సాధనే మార్గం:** కూచిపూడి సాధనలో తరాల అంతరం ఉంది. మా పేరెంట్స్ చేసినంత మేం చేయలేదు. మేం చేసినంత మా స్టూడెంట్స్ చేయట్లేదు. జీవితం షార్ట్ అయిపోయింది. సోషల్ మీడియా వచ్చాక అన్నీ తొందరగా నేర్చుకోవాలనుకుంటున్నారు. తొందరగా స్టేజ్ ఎక్కాలని ఆరాటపడుతున్నారు. ఈ రోజుల్లో చిన్న వయసులో రంగ ప్రవేశం చేస్తున్న పిల్లల్లో ఎంతోమందిలో ప్రావీణ్యం లేదు. తల్లిదండ్రుల ఆరాట మే ఉంది.


# యూపీ తర్వాతే ఏపీనే...

**తిరుపతి,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ బడుల్లో పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. కేంద్రం సహకారంతో.. పీఎంశ్రీ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పిస్తూ, వృత్తి విద్యతో పాటు ఆధునిక విద్యను అందిస్తోంది. ఆటపాటలతో పాటు, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, పిల్లల సమగ్ర వికాసానికి కృషి చేస్తోంది. భవిష్యత్తుకు బాటలు వేసేలా ఈ పాఠశాలలు తీర్చిదిద్దుతున్నారు. దేశంలోనే యూపీ తర్వాత ఏపీలోనే ఎక్కువ పీఎంశ్రీ స్కూళ్లు ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఈ దిశగా కేంద్రం సహకారంతో పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో 1,725 పీఎంశ్రీ పాఠశాలలతో మొదటి స్థానంలో ఉండగా.. ఆంధ్రప్రదేశ్ 935 పాఠశాలలతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ పీఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం 60 శాతం నిధులను.. మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. పీఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.407.53 కోట్లను మంజూరు చేసింది. ఇప్పటికే సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఈ పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేశారు. స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్యను బట్టి నిర్వహణ ఖర్చుల కోసం నిధులను విడుదల చేశారు. ఈ నిధులు రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఇచ్చారు.రాష్ట్రంలో 794 పాఠశాలల్లో 9 నుండి 12 తరగతుల విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులను అందిస్తున్నారు. ఈ పాఠశాలల్లో 10 రకాల వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టడానికి వీలుగా ప్రతి పాఠశాలలో ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించడానికి 1,898 ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. ఈ కోర్సుల కోసం 1,898 మంది శిక్షకులను నియమించగా.. శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన శిక్షకులను నియమించారు. వీరిలో 400 మంది ఎన్ఎస్‌డీసీ నుంచి గుర్తింపు పొందిన నిపుణులు. ఇది విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందేలా చూస్తుంది. ఈ వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందిస్తాయి.విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దసరా, సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులకు సమీపంలోని పరిశ్రమలు, సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌లు అందిస్తున్నారు. అంతేకాదు వృత్తి విద్య కోర్సులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందిస్తున్నారు. ఎన్‌సీఈఆర్టీ రూపొందించిన 'కౌశల్ బోధ్' పుస్తకాలను ఆరు నుంచి 8వ తరగతి విద్యార్థులకు అందజేస్తున్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సెంటర్లకు అవసరమైన ప్రత్యేక సామాగ్రిని అందిస్తారు. విద్యార్థుల వ్యక్తిగత అభ్యాస విధానం (పాల్)ను అమలు చేస్తున్నారు.ఈ పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ మేరకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి ఆర్వో (రివర్స్ ఆస్మాసిస్) ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పరిశుభ్రత కోసం ఆధునిక మరుగుదొడ్లు, చేతులు కడుక్కోవడానికి ప్రత్యేక పాయింట్లను నిర్మిస్తున్నారు. బాలికల సౌకర్యం కోసం వారికి అవసరమైన శానిటరీ ప్యాడ్లను అందుబాటులో ఉంచుతున్నారు. వీటిని సులభంగా పొందేందుకు వెండింగ్ మెషీన్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సౌకర్యవంతంగా కూర్చొని చదువుకోవడానికి, పాఠాలు చెప్పడానికి అవసరమైన ఫర్నిచర్‌ను అందిస్తున్నారు.పాఠశాలల్లో సైన్స్ విద్యను ప్రోత్సహించడానికి, భౌతిక, రసాయన, జీవశాస్త్ర ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రయోగశాలల్లో విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలు చేసి, సైన్స్ విషయాలను లోతుగా అర్థం చేసుకోగలుగుతారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి, పాఠశాలలకు ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నారు. తరగతి గదుల్లోనే కాకుండా, పాఠశాల ప్రాంగణంలో ఎక్కడైనా ఇంటర్నెట్ ఉపయోగించుకోవచ్చు. విద్యార్థుల భద్రత కోసం, పాఠశాలల్లో అన్ని చోట్లా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లు, స్మార్ట్ తరగతి గదులు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. స్మార్ట్ తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు, ప్రొజెక్టర్లు వంటి ఆధునిక పరికరాలు ఉంటాయి. విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉండే గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారుశారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కోసం క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నారు. ఆట స్థలాలను అభివృద్ధి చేసి, విద్యార్థులు ఆడుకోవడానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు. బాలికలకు తమను తాము రక్షించుకోవడానికి ఆత్మరక్షణ శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్తులో మంచి కెరీర్ ఎంచుకోవడానికి, పిల్లలకు అవసరమైన కౌన్సెలింగ్‌ను అందిస్తున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి స్కౌట్స్, గైడ్స్ కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారు. పాఠశాల బ్యాండ్లు, సంగీతం వంటి కళల్లో కూడా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే పీఎంశ్రీ స్కూళ్లలో కార్పొరేట్ బడులకు దీటుగా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు అధికారులు.

# కెరీర్‌కు ఘోస్ట్ గ్రోత్

కెరీర్ వృద్ధి ఒకప్పుడు స్పష్టంగా కనిపించేది. ఒక ఉద్యోగికి బాధ్యతలు పెరగడం; ఉన్నత స్థాయికి చేరుకోవడం; ఎక్కువ జీతం అందుకోవడం.. ఇలా ఒక సంస్థలో చాలామంది తమ కెరీర్‌లో పురోగతిని చూసేవారు. కానీ, ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. అంతా గందరగోళంగా తయారైంది. ఇప్పుడు చాలామంది ఎక్కువ కష్టపడి పనిచేస్తున్నారు. కొత్త విషయాలను వేగంగా నేర్చుకుంటున్నారు. అధిక బాధ్యతలను మోస్తున్నారు. కానీ, ఎక్కువ జీతాన్ని మాత్రం పొందలేక పోతున్నారు. ప్రమోషన్లలో కూడా ఎక్కడ ఉన్నవారు అక్కడే ఆగిపోతున్నారు. దీనినే 'ఘోస్ట్ గ్రోత్' అని నిపుణులు పిలుస్తున్నారు.ఈ 'ఘోస్ట్ గ్రోత్' వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఉద్యోగులు.. కెరీర్‌లో ముందుకు సాగలేకపోతున్నారని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. తాజాగా,'మై పర్‌ఫెక్ట్ రెజ్యూమె' నిర్వహించిన ఓ సర్వే.. ఇందుకు సంబంధించిన ఆసక్తికర విషయాలను బయటపెట్టింది. సర్వేలో భాగంగా అమెరికాకు చెందిన 1,000 మంది నిపుణుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా 53 శాతం మంది తమ కెరీర్‌లో 'ఘోస్ట్ గ్రోత్' బారిన పడ్డట్లు చెప్పుకొచ్చారు. ఉద్యోగంలో పని పెరుగుతున్నా.. పురోగతి మాత్రం కనిపించడం లేదని వాపోయారు.

**రెండువైపులా పదును..:** నిజానికి 'ఘోస్ట్ గ్రోత్' అనేది రెండువైపులా పదునున్న కత్తిలాంటిది. సాధారణంగా ఇది రెండు ప్రధాన కోణాల్లో కనిపిస్తున్నది. మొదటిది.. బాధ్యతలు పెరగడం – హోదా మారకపోవడం. చాలా కంపెనీల్లో ఉద్యోగి చేసే పని పరిధి నిరంతరం పెరుగుతూనే ఉంటుంది. కానీ, వారి హోదా, జీతం మాత్రం అలాగే ఉంటున్నాయి. ఈ ధోరణి.. ఉద్యోగుల్లో తీవ్రమైన అసంతృప్తిని కలిగిస్తున్నది. రెండో విషయం.. ఉద్యోగి నైపుణ్యాలు పెరగడం. 'ఘోస్ట్ గ్రోత్'.. కొన్నిసార్లు ఉద్యోగులకూ లాభం తెచ్చిపడుతుందట. అధిక బాధ్యతలు అప్పగించడం వల్ల ఉద్యోగి వ్యక్తిగతంగా కొత్త విషయాలను నేర్చుకునే అవకాశం



లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ ఎవరైనా ఘోస్ట్ గ్రోత్‌ను అనుభవిస్తున్నారని భావిస్తే.. కొన్ని పనులు చేయడం మంచిదని సూచిస్తున్నారు. ఉద్యోగి చేస్తున్న అదనపు బాధ్యతలను ఎప్పటికప్పుడు రికార్డు చేసుకోవాలని సలహా ఇస్తున్నారు. పెర్ఫార్మెన్స్ రివ్యూ మీటింగ్స్‌లో మీ నైపుణ్యాల పెరుగుదల వల్ల కంపెనీకి జరిగిన మేలును వివరించి, ప్రమోషన్, శాలరీ హైక్ లాంటివి కోరవచ్చుట.

# వాకింగ్‌లో ఎన్ని రకాలు ఉంటాయో తెలుసా..?



**మనకు అందుబాటులో ఉన్న అత్యంత సురక్షితమైన, అసలు ఖర్చు లేని వ్యాయామాల్లో వాకింగ్ ఒకటి. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎవరైనా సరే వాకింగ్ చేయవచ్చు. రోజూ 30 నిమిషాల పాటు వాకింగ్ చేయడం వల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయి. అయితే వాస్తవానికి వాకింగ్‌లోనూ చాలా రకాలు ఉంటాయి. ఒక్కో రకమైన వాకింగ్ చేయడం వల్ల శరీరంలోని భిన్న అవయవాలకు భిన్నమైన ఫలితాలు కలుగుతాయి. అయితే ఎవరైనా సరే తమకు ఏ రకమైన వాకింగ్ సెట్ అవుతుందో దాన్ని చేయాల్సి ఉంటుంది. దీంతో ఎక్కువ ఫలితాన్ని పొందవచ్చు. ఇక వాకింగ్ లో ఎన్ని రకాలు ఉంటాయో, ఏ తరహా వాకింగ్‌తో ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.**


**బ్రిస్క్ వాకింగ్..:** వేగవంతమైన నడకను బ్రిస్క్ వాకింగ్ అంటారు. ఈ వాకింగ్‌లో చేతులను గట్టిగా ఊపుతూ గంటకు కనీసం 3 నుంచి 4 మైళ్ల వేగంతో వాకింగ్ చేయాల్సి ఉంటుంది. దీన్నే బ్రిస్క్ వాకింగ్‌గా చెబుతారు. ఈ తరహా వాకింగ్‌ను రోజూ 30 నిమిషాల పాటు చేస్తే బీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. హృదయ సంబంధిత వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అయితే ఈ వాకింగ్‌ను రోజూ చేయాల్సిన పనిలేదు. వారంలో కనీసం 5 సార్లు చేసినా చాలు, దీంతో ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. కొలెస్ట్రాల్, అధిక బరువు ఎక్కువగా ఉన్నవారు, షుగర్ ఉన్నవారు ఈ వ్యాయామం చేస్తే మంచిది.

**పవర్ వాకింగ్..:** ఇక బ్రిస్క్ వాకింగ్‌నే ఇంకాస్త వేగంగా చేయాల్సి ఉంటుంది. అంటే గంటకు 5 మైళ్ల వేగంతో వాకింగ్ చేయాలన్నమాట. అలాగే చేతులను కూడా ఇంకాస్త వేగంగా ఊపాల్సి ఉంటుంది. దీన్నే పవర్ వాకింగ్ అంటారు. పవర్ వాకింగ్ వల్ల శరీరంలో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారికి పవర్ వాకింగ్ ఎంతగానో మేలు చేస్తుంది. త్వరగా బరువు తగ్గవచ్చు. శరీరంలోని కొవ్వు త్వరగా కరిగిపోతుంది. ఈ వ్యాయామాన్ని కూడా వారంలో 5 రోజుల పాటు చేస్తే సరిపోతుంది. 2 రోజులు విశ్రాంతి తీసుకోవచ్చు.

**ట్రెయిల్ వాకింగ్..:** ప్రకృతి కాసేపు వాకింగ్ చేస్తూ కాసేపు రెస్ట్ తీసుకోవడాన్ని ట్రెయిల్ వాకింగ్ అంటారు. దీని వల్ల శరీరానికి ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా మారుతాయి. శ్వాసకోశ సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. మైండ్ రిలాక్స్ అవుతుంది. ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఈ తరహా వాకింగ్‌ను రోజూ చేయవచ్చు. ఇక చిన్నపాటి పొడవైన స్టిక్స్ సహాయంతో నడవడాన్ని నోర్డిక్ వాకింగ్ అంటారు. దీని వల్ల శరీరంలోని పైభాగానికి కూడా సపోర్ట్ లభిస్తుంది. కండరాలు దృఢంగా మారుతాయి. వయస్సు మీద పడినవారు, బ్యాలెన్స్ సరిగ్గా లేనివారు లేదా సర్జరీలు అయిన వారు స్టిక్స్ సహాయంతో ఈ వాకింగ్ చేయవచ్చు. దీంతో త్వరగా కోలుకుంటారు.

**బ్యాక్ వార్డ్స్ వాకింగ్..:** సాధారణ వాకింగ్‌కు బదులుగా వెనక్కి కూడా నడవవచ్చు. దీన్నే బ్యాక్‌వార్డ్స్ వాకింగ్ అంటారు. దీని వల్ల శరీర భంగిమ సరిగ్గా ఉంటుంది. బ్యాలెన్స్ అదుపులోకి వస్తుంది. వెన్నెముక కండరాలు దృఢంగా మారి వెన్నుకు సపోర్ట్ లభిస్తుంది. వెన్ను నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే చెప్పుల్లేకుండా కూడా నడవవచ్చు. ఇలా ప్రకృతిలో పచ్చగడ్డి మీద నడవాల్సి ఉంటుంది. దీంతో అరికాళ్లలో ఉండే పలు నాడులకు భూమి ఆకర్షణ శక్తి లభిస్తుంది. దీంతో శరీరంలోని పలు నాడులు యాక్టివేట్ అవుతాయి. దీంతో పలు రకాల వ్యాధుల నుంచి బయట పడవచ్చు. ఇలా పలు రకాల వాకింగ్‌లలో మీకు కావల్సిన వాకింగ్‌ను చేసి దాంతో అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు.

# కోపాన్ని అదుపులో పెట్టుకోవాలి !



కోపాన్ని మనసు నుంచి తొలగించుకొనేందుకు మనిషికి నిరంతర సాధన చేయాలి. అలా చేస్తే శరీరం అదుపులోకి వస్తుంది. కోపం జయిస్తే ఇంద్రియాలను జయించవచ్చు. వసిష్ఠుడి మీద కోపంతో విశ్వామిత్రుడు ఘోర తపస్సు చేశాడు. పరమశివుడు ప్రత్యక్షం కాగా ధనుర్వేద రహస్యాలను బోధించమని కోరతాడు. శివుడు అంగీకరించి అన్ని అస్త్ర విద్యలను సిద్ధింప జేస్తాడు. ఆ అస్త్రాలను వసిష్ఠుడిపై ప్రయోగించగా ఆయన తన తపశ్శక్తితో వాటిని నిలువరిస్తాడు. క్షత్రియుడిగా ఉండి బ్రహ్మర్షిని జయించడం కష్టమని విశ్వామిత్రుడు తెలుసుకుంటాడు. బ్రహ్మర్షిగా మారడానికి దీర్ఘకాలం తపోదీక్ష వహిస్తాడు. బ్రహ్మ ప్రత్యక్షమై బ్రహ్మర్షిత్వాన్ని పొందావని చెప్పినా అతడిలో పూర్తిగా సంతోషం కలగదు. వసిష్ఠుడితో 'బ్రహ్మర్షీ!' అని పిలిపించుకోవాలని ఉందన్న కోరికను తెలియజేస్తాడు. వసిష్ఠుడు అలాగేనని పలుకుతాడు. అయితే ఆయన పూర్తిగా క్రోధాన్ని విడిచిపెట్టాడో లేదో తెలుసుకోవాలనే ఉద్దేశంతో విశ్వామిత్రుడు తనవద్దకు వస్తేనే బ్రహ్మర్షీ అని పిలుస్తానని చెబుతాడు. విశ్వామిత్రుడు వసిష్ఠుడి వద్దకు వెళ్లగా ఎందుకు వచ్చావంటూ ప్రశ్నించి దూరంగా పొమ్మంటాడు. ఆయన వెళ్లబోతుండగా మరలా రమ్మంటాడు. ఇలా పదేపదే చేసినా విశ్వామిత్రుడి ముఖంలో ప్రశాంతత చెదరకపోయేసరికి నిజంగానే బ్రహ్మర్షివయ్యావంటూ అభినందిస్తాడు. పతన హేతువైన క్రోధాన్ని గెలిచి చూడు, నువ్వే విశ్వామిత్రుడివవుతావు. అందుకే మనలో ఉన్న క్రోధాన్ని జయిస్తే..ప్రపంచాన్ని జయించడమే కాదు..భగవంతుడినీ జయించవచ్చు.

# పెంకితనం పోగొట్టాలంటే..




పిల్లలు ఒక్కోసారి చాలా మొండిగా వ్యవహరిస్తుంటారు. తాము అనుకున్నట్లే జరగాలని పట్టుబడతారు. తమకు నచ్చినట్లు జరగకపోతే తల్లిదండ్రులనే కాదు.. ఎవరినైనా లెక్కచేయరు. ఒక్కోసారి అనకూడని మాటలు కూడా అనేస్తుంటారు. ఇంకాస్త రెచ్చిపోయి అక్కడ ఏ వస్తువుంటే అది.. ఒకవేళ చేతిలో ఉన్నదైనా.. అది ఎంత విలువైనదైనా.. ఏమాత్రం ఆలోచించకుండా విసిరి కొడతారు. ఇంకొందరు తల్లిదండ్రులపై దాడి చేస్తారు. ఇలాంటి పిల్లల ప్రవర్తనతో ఒక్కోసారి తల్లిదండ్రులూ ఓర్పు వహించలేక రెండు తగిలిస్తారు. అయితే ఇలా చేస్తే వారిలో మార్పు రాకపోగా, వారి ప్రవర్తన మరింత దిగజారుతుందనేది నిపుణుల హెచ్చరిక. వారి వైఖరిలో మార్పు తేవడానికి ఏవిధంగా వ్యవహరించాలో నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. పిల్లలు జాలి, దయ, కరుణ, ఎదుటివారి పట్ల సానుభూతి, తోటివారి పట్ల సహానుభూతితో వ్యవహరించకపోతే.. వాటి గురించి చెప్పి, నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. వీటన్నింటికన్నా ముందు స్నేహంగా, ప్రేమగా మెలగడం, ఆప్యాయంగా పలకరించడం, అనురాగం కలిగి ఉండడం ఎంత అవసరమో వివరించాలి. అసలు చెప్పకుండా ఇవన్నీ వారి నుంచి ఆశించడం అత్యాశే అవుతుంది.

**కారణాలు గుర్తించాలి..:** పిల్లలు ఇలా పెంకిగా వ్యవహరించడానికి అసలు కారణాలు ఏమిటో తెలుసుకోవాలి. ఒక్కోసారి పిల్లలు వారిలోని బాధల్ని సరిగా వ్యక్తపరచలేకపోవడమే ప్రధానకారణం అంటున్నారు నిపుణులు. వారికి కలిగే బాధ, కష్టం తల్లిదండ్రులకు వ్యక్తపరచలేనప్పుడే పిల్లలు ఇలా మొండిగా వ్యవహరిస్తారని అంటున్నారు. అలాంటి సందర్భాల్లో తల్లిదండ్రుల బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుంది. పిల్లల బాధ ఏమిటో తల్లిదండ్రులే తరచి చూడాలి. ఇంకా చెప్పాలంటే తల్లిదండ్రులు కారణం ఏమిటో పరిశోధించాలి. అప్పుడే వాళ్లు ఏం చెప్పదలచుకున్నారో అర్థంచేసుకోవడానికి తల్లిదండ్రులే ప్రయత్నించాలని చెప్తున్నారు నిపుణులు.

**సభ్యమైన పదజాలం వాడేలా..:** పిల్లలు ఏదైనా కొత్త పదం వినగానే పదే పదే అదే రిపీట్ చేస్తుంటారు. అందుకే పిల్లల ముందు పెద్దలు జాగ్రత్తగా ఉండాలి. అదే సందర్భంలో పిల్లలు తోబుట్టువులతో, తల్లిదండ్రులతో, బయటివారితో, పెద్దలతో, తోటి స్నేహితులతో, బంధువులతో ఎవరితో ఎలా మాట్లాడాలో చెప్పాలి. ఎలాంటి పదజాలం ఉపయోగించాలి అనేది నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అంటున్నారు నిపుణులు. మాట్లాడే విధానంతోనే తన పట్ల ఎలాంటి గౌరవం ఏర్పడుతుందో, తనకు నెరవేరాల్సినవి ఎలా వనగూడతాయో తెలియజెప్పాలి. ఇవన్నీ వారి భావోద్వేగాలనుమెరుగైనపద్ధతిలో వ్యక్తిక రించడానికి తోడ్పడుతుంది. అంతేకాదు తమని తాము తీర్చిదిద్దు కోవడానికి, ప్రవర్తనపరమైన లోపాలు సరిజేసేందుకు ఉపయోగపడు తుంది. జాలి, దయ వంటి సుగుణాలు కూడా అలవడు తాయని చెప్తున్నారు నిపుణులు. కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా పిల్లల్లో మెరుగుప డతాయి. దీనివల్ల వారి భవిష్యత్తుకు మెరుగైన మార్గం ఏర్పడినట్లే. మంచి పదాలను నేర్పించడం వల్ల, వాళ్లు వాటిని ప్రాక్టీస్ చేయడం వల్ల వారి పట్ల వారికే నమ్మకం కలుగుతుందని అంటున్నారు. చిన్న అభినందన కొండంత ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఇలా చేయడం వల్ల వారిని మరింత బలంగా మార్పు వైపు ప్రోత్సహించినట్లే అంటున్నారు నిపుణులు. పిల్లలకు ప్రశంస అనేది బూస్ట లాంటిది. పిల్లలు తల్లిదండ్రులు ప్రోత్సహించాలనే ఎక్కువగా కోరుకుంటారు. అందుకే ఎలాంటి పనులు చేస్తే మీ నుంచి అభినందనలు వస్తాయో పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి. దానివల్ల వారు అలాగే నడుచుకుంటూ తల్లిదండ్రుల నుంచి బోలెడు అభినందనలు పొందుతారు. పిల్లల్ని ప్రోత్సహించి, మంచి ప్రవర్తన కలవారిగా తయారుచేయండి అంటున్నారు నిపుణులు. దీనివల్ల పిల్లల్లో మొండితనం అనేదే కనపడదని చెప్తున్నారు.

## వట్టి వేరు.. ఉపయోగాలు వేర్వేరు..





సాధారణంగా ఎండాకాలంలో ఇల్లు చల్లదనం కోసం వట్టి వేళ్లతో చేసిన చాపలు వాడుతుంటారు. కొబ్బరి నూనెలో వేసుకుని కూడా కొంతమంది ఉపయోగిస్తుంటారు. వీటిని ఆహారంలో కూడా భాగం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఈ వేర్లలో ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటిని ఎక్కువగా ఔషధాల్లో వాడతారని వైద్యులు చెబుతున్నారు. వట్టివేరుతో షర్బత్ తయారుచేసుకుని తాగడం వల్ల ఎండాకాలం తరచూ వచ్చే కడుపు నొప్పి, మలబద్ధకం, తలనొప్పి తగ్గుతాయి. నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. మెదడుకి రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది.వట్టివేరు సారం శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. సువాసన భరితంగా ఉండడం వల్ల ఒత్తిడి కూడా దూరమవుతుంది.నిద్రలేమిని పోగొట్టి జీర్ణ సమస్యలని దూరం చేస్తుంది..తలనొప్పితో బాధపడుతుంటే ఈ వేర్లని నీటిలో నానబెట్టి ఆ నీటిని తాగొచ్చు. వేర్లని మెత్తని పేస్టులా నూరి దానిని తలపై పట్టిలా వేసుకుని కాసేపయ్యాక శుభ్రం చేసుకున్నా తలనొప్పి తగ్గిపోతుంది. వేర్లని ఓ గ్లాసులో వేసి ఓ నాలుగైదు గంటలు లేదా రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తాగాలి. దీని వల్ల డీహైడ్రేషన్ సమస్య దూరమవుతుంది. కుండనీళ్లు వాడేవారు ఈ వట్టివేరుని ఓ తెల్లని వస్త్రంలో మూట కట్టి ఆ నీటిలో వేయాలి. రెండు, మూడ్రోజులకి ఓసారి వట్టివేరును మార్చుకోవాలి. కుండ నీటిలో నానబెట్టిన వట్టివేర్లని పారేయకుండా దానిని మెత్తగా నూరుకొని ప్యాక్‌లా ముఖానికి వేసుకోవచ్చు. దీంతో ముఖంపై ఉన్న మచ్చలు, మొటిమలు దూరమవుతాయి. వట్టివేర్లని నీటిలో వేసి మరిగించి స్నానానికి వాడే నీటిలో కలిపి స్నానం చేస్తే చెమట వాసన దూరమవుతుంది.

# చెమటకాయలు పోవాలంటే..



వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే అతి ముఖ్యమైన సమస్యల్లో చెమటకాయలు ఒకటి. వీటి కారణంగా చర్మం దురద పెట్టటమే కాకుండా మృదుత్వాన్నికోల్పోతుంది. కొన్ని సహజసిద్ధమైన చిట్కాలను పాటిస్తే చాలా సులభంగా చెమటకాయల నుంచి బయట పడొచ్చు.

పెరుగు : చెమట కాయలు ఉన్న ప్రదేశంలో చల్లని పెరుగుని అప్లై చేసి 15 నిమిషాలు ఉంచాలి. తరువాత చల్లని నీటితో కడిగేసి మెత్తటి బట్టతో అద్దాలి.పెరుగులో సహజంగాఉండేయాంటీ బ్యాక్టీరియల్,యాంటీ ఫంగల్ ప్రాపర్టీస్ చెమటకాయలు రాకుండా చేస్తాయి.

రోజ్ వాటర్ : 200 ఎంఎల్ రోజ్ వాటర్‌లో నాలుగు టేబుల్ స్పూన్ల తేనె, 200 ఎంఎల్ ప్యూర్ వాటర్ కలపాలి. బాగా కలిపి ఐస్ ట్రేలో పోసి ఫ్రీజ్ చేయాలి. ఇవి క్యూబ్స్‌లా అయ్యాక నాలుగైదు క్యూబ్స్ తీసుకుని పల్చని మస్లిన్ బట్టలో చుట్టి చెమట కాయలు ఉన్న ప్రదేశంలో మృదువుగా అద్దాలి. రోజ్ వాటర్ చర్మం పీహెచ్ బ్యాలెన్స్‌ని మెయింటెయిన్ చేస్తుంది. ఎక్కువగా ప్రొడ్యూస్ అయ్యే ఆయిల్‌ని కంట్రోల్ చేస్తుంది.గంధం : గంధానికి చల్లని ఫుల్ ఫ్యాట్ మిల్క్ కలిపి ఆ మిశ్రమాన్ని చెమట కాయలు ఉన్న ప్రదేశంలో పట్టించి గాలికి ఆరనివ్వాలి. ఆ తరువాత చల్లని నీటితో కడిగేయాలి.ముల్తానీ మిట్టి : మూడు టేబుల్ స్పూన్ల ముల్తానీ మిట్టిలో రెండు టీ స్పూన్ల పుదీనా పేస్ట్ కలిపి తగినన్ని చల్లని పాలు పోసి స్మూత్ పేస్ట్ తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని చర్మం మీద అప్లై చేసి గాలికి ఆరనివ్వాలి.

ఆ తరువాత చల్లని నీటితో కడిగేయాలి.కలబంద : చెమటకాయలు ఉన్న ప్రదేశంలో కొంచెం కలబంద గుజ్జు రాస్తే త్వరగా తగ్గిపోతాయి. కలబందలో ఆస్ట్రిజెంట్ లక్షణాలు ఉండటం వలన చెమటకాయలు త్వరగా తగ్గటానికి సహాయపడతాయి. చర్మంపై ఉండే ఇన్‌ఫెక్షన్లను కూడా తగ్గిస్తుంది.టీ ట్రీ ఆయిల్ : టీ ట్రీ ఆయిల్‌లో యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు సమృద్ధిగా ఉంటాయి .కొంచెం టీ ట్రీ ఆయిల్‌ను తీసుకుని దానికి కొంచెం నీటిని కలిపి మిశ్రమంగా తయారు చేయాలి. ఆ మిశ్రమంలో కాటన్ బాల్‌ను ముంచి చర్మంపై రాస్తే చెమట కాయలు చాలా త్వరగా తగ్గిపోతాయి.వెనిగర్ : టిష్యూ పేపర్‌ను తీసుకుని వెనిగర్‌లో ముంచి చెమట కాయలు ఉన్న ప్రదేశంలో అద్దాలి. ఇలా చేస్తే చెమట కాయలు త్వరగా తగ్గిపోతాయి.లవంగ నూనె : కాటన్ బాల్‌ను తీసుకుని లవంగ నూనెలో ముంచి చెమటకాయలు ఉన్న ప్రదేశంలో రాస్తే చెమట కాయలు తగ్గుముఖం పడతాయి. తరచూ ఇలా చేయడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.

# హైడ్రేటెడ్‌గా ఉంటేనే.. అందం!



వేసవి వేడి.. మీ చర్మం తేమను కోల్పోయేలా చేస్తుంది. చర్మం పొడిబారి.. అందం బీటలు వారుతుంది. అంతేకాదు.. సూర్యుడి హానికరమైన యూవీ కిరణాలు.. చర్మంలో మెలనిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. తద్వారా చర్మం రంగు మారడంతోపాటు ముఖంపై నల్ల మచ్చలూ ఇబ్బంది పెడుతాయి. వీటినుంచి బయట పడాలంటే.. ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే!


చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి పుష్కలంగా నీరు తాగాలి. రోజుకు కనీసం 8-10 గ్లాసులైనా తీసుకోవాలి. దీనివల్ల శరీరం నుంచి టాక్సిన్స్ బయటికి వెళ్లిపోతాయి. చర్మం లోపలి నుంచి హైడ్రేటెడ్‌గా మారుతుంది. నీటిశాతం అధికంగా ఉండే దోసకాయలు, పుచ్చకాయ, నారింజ, స్ట్రాబెర్రీలను ఎక్కువగా తీసుకోండి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేయడమే కాకుండా.. చర్మానికి అవసరమైన పోషకాలను కూడా అందిస్తాయి. ఆహారంలో యాంటి ఆక్సిడెంట్స్, విటమిన్ సి ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవి యూవీ కిరణాల నుంచి చర్మానికి రక్షణ కల్పిస్తాయి. విటమిన్ సి.. శరీరంలో ఫ్రీరాడికల్స్‌తోపాటు మెలనిన్ ఉత్పత్తిని నిరోధిస్తుంది. నల్లమచ్చలు రాకుండా కాపాడుతుంది. ఇక ఎక్కువ సమయంపాటు ఏసీ గదుల్లో ఉన్నా.. చర్మం పొడిబారుతుంది. ఏసీల నుంచి వచ్చే పొడిగాలి.. చర్మంలో తేమను తొలగిస్తుంది. కాబట్టి, ఇంట్లో, కార్యాలయాల్లో హ్యూమిడిఫయర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఇవి గాలికి తేమను అందించి.. చర్మం ఎక్కువ పొడిగా మారకుండా నిరోధిస్తాయి.చర్మ సంరక్షణ కోసం కలబంద వంటి హైడ్రేటింగ్ పదార్థాలను కలిగిన మాయిశ్చరైజర్లు వాడాలి. ఇవి చర్మం తేమను కోల్పోకుండా కాపాడతాయి. చర్మాన్ని మృదువుగా మార్చడంలో సహాయపడతాయి.వేసవిలోనే కాదు.. ఏడాదంతా సన్‌స్క్రీన్ లోషన్ వాడటం మంచిది. ఇది హైపర్‌పిగ్మెంటేషన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తుంది. రసాయనాలు తక్కువగా ఉండే ఉత్పత్తులను ఎంచుకోండి. ఇక వేసవిలో ప్రతి రెండుమూడు గంటలకు ఒకసారి సన్‌స్క్రీన్ లోషన్‌ను అప్లయి చేస్తూ ఉండాలి.

# ఒడిశా గుహల్లో ఆదిమానవుల ఆనవాళ్లు...

**ఒడిశాలో 15,000 ఏళ్ల నాటి మానవ నివాస ఆనవాళ్లు వెలుగులోకి**
**రాతియుగం నాటి పనిముట్లు, అద్భుతమైన రాతి చిత్రాలు లభ్యం**
**హరప్పా నాగరికత కంటే ఇవి పురాతనమైనవని నిపుణుల అంచనా**
**సంబల్‌పుర్ జిల్లా గుహల్లో ఏఎస్ఐ చేపట్టిన తవ్వకాల్లో ఆవిష్కరణ**



ఢిల్లీ,: ఒడిశాలో భారత పురాతన చరిత్రకు సంబంధించిన అత్యంత కీలకమైన ఆనవాళ్లు బయటపడ్డాయి. సంబల్‌పుర్ జిల్లాలోని రైరాఖోల్ ప్రాంతంలో ఉన్న భీమ మండలి గుహల్లో దాదాపు 15,000 ఏళ్ల క్రితం ఆదిమానవుల నివసించినట్లు ఆధారాలు లభించాయి. భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) చేపట్టిన తవ్వకాల్లో ఈ చారిత్రక సంపద వెలుగు చూసింది. పురావస్తు శాస్త్రవేత్తలు జరిపిన ఈ పరిశోధనల్లో, రాతి యుగానికి చెందిన పనిముట్లు, ఆయుధాలతో పాటు గుహల గోడలపై గీసిన అద్భుతమైన చిత్రాలు (రాక్ పెయింటింగ్స్) లభించాయి. ఈ ఆధారాలు సింధు లోయలోని హరప్పా, మొహెంజోదారో నాగరికతల కన్నా ఎంతో పురాతనమైనవి కావచ్చని నిపుణులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఆనవాళ్ల కచ్చితమైన వయస్సును నిర్ధారించేందుకు కార్బన్ డేటింగ్ పరీక్షల నిమిత్తం నమూనాలను పంపినట్లు అధికారులు వెల్లడించారు. గంగాధర్ మెహర్ యూనివర్సిటీ చరిత్ర విభాగం ప్రకారం, ఈ ప్రాంతంలో 45కు పైగా రాతి ఆవాసాలు ఉన్నాయి. వీటిలోని చిత్రాల్లో ఆదిమానవుల జీవనశైలి, వేట దృశ్యాలు, జంతువుల బొమ్మలు కనిపిస్తున్నాయి.



సహజసిద్ధమైన రంగులతో గీసిన ఈ చిత్రాలు నాటి మానవుల కళా నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. స్థానికులు ఈ గుహలను మహాభారత కాలం నాటివిగా నమ్ముతున్నప్పటికీ, శాస్త్రీయంగా ఇవి అంతకంటే ఎంతో ప్రాచీనమైనవని తేలింది. ఈ చారిత్రక ప్రదేశాన్ని జాతీయ వారసత్వ సంపదగా గుర్తించి, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని చరిత్రకారులు, స్థానికులు కోరుతున్నారు. ఈ తవ్వకాలతో భారత ఉపఖండంలోని ఆదిమానవ చరిత్రకు సంబంధించి మరిన్ని కొత్త విషయాలు తెలిసే అవకాశం ఉంది.

# ప్రయాగ్‌రాజ్‌లో 44 రోజుల పాటు మాఘ మేళా...

అలహాబాద్, : ప్రయాగ్‌రాజ్‌లో 44 రోజుల పాటు సాగే మాఘ మేళా మొదలైంది. 2025లో నిర్వహించిన మహా కుంభమేళాకు మన దేశ నలుమూలల నుంచే కాకుండా.. ప్రపంచ దేశాల నుంచి.. కోట్లాది మంది భక్తులు వచ్చారు. ఇప్పుడు మాఘ మేళాకు కూడా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో గతేడాది మహా కుంభమేళా జరగ్గా.. ప్రస్తుతం మరో మాఘ మేళా మొదలైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనంగా రికార్డుల్లోకి ఎక్కింది. అయితే ఈసారి అక్కడ మాఘ మేళా నిర్వహిస్తున్నారు. మొత్తం 44 రోజుల పాటు సాగే ఈ మాఘ మేళా.. పౌష పూర్ణిమ నుంచి మహాశివరాత్రి వరకు కొనసాగనుంది. ఈ ఉత్సవంలో కోట్లాది మంది భక్తులు సంగమ స్నానాలు ఆచరించనున్నారు. ఈ మాఘ మేళాకు విచ్చేసే భక్తుల కోసం యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రత, రవాణా ఏర్పాట్లు చేసింది. కుంభమేళా స్థాయి ఆధ్యాత్మిక అనుభూతిని ప్రశాంతమైన వాతావరణంలో పొందాలనుకునే వారికి ఈ మేళా సరైన వేదిక అని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. పవిత్ర త్రివేణి సంగమం వద్ద మాఘ మేళా 2026 అట్టహాసంగా ప్రారంభమైంది. జనవరి 3వ తేదీన పౌష పూర్ణిమ పుణ్యస్నానంతో మొదలైన ఈ ఆధ్యాత్మిక ఉత్సవం ఫిబ్రవరి 15వ తేదీన మహాశివరాత్రి వరకు మొత్తం 44 రోజుల పాటు కొనసాగనుంది. కుంభమేళాతో పోలిస్తే తక్కువ రద్దీ.. ప్రశాంతమైన వాతావరణంలో భక్తి పారవశ్యాన్ని పొందేవారికి ఇది ఒక చక్కని అవకాశంగా మారనుంది. గతేడాది జరిగిన మహా కుంభమేళా రద్దీతో పోలిస్తే.. ఈ మాఘ మేళా భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. గంగ, యమున అంతర్వాహిని అ?న సరస్వతీ నదుల కలయిక అయిన త్రివేణి సంగమం వద్ద పవిత్ర స్నానం ఆచరించడం వల్ల పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం.



మాఘ మేళా ప్రారంభ తొలి రోజు అయిన పౌష పూర్ణిమ నాడే సుమారు 21.5 లక్షల మంది భక్తులు సంగమ తీరంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. ఈ మేళాలో ఆరు ప్రధాన స్నాన దినాలు ఉన్నాయి. భక్తుల సౌకర్యార్థం 800 హెక్టార్ల మేళా ప్రాంతాన్ని 7 సెకార్లుగా విభజించారు. సుమారు 3800 ప్రత్యేక బస్సులు.. 42 పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. ఈ మాఘ మేళాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. 17 పోలీస్ స్టేషన్లు, 42అవుట్ పోస్టులు, 400 సీసీటీవీ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంచారు. మెడికల్ ఎమర్జెన్సీ కోసం మాఘ మేళా ప్రాంగణంలోనే రెండు 20 పడకల ఆస్పత్రులను నిర్మించారు. ప్రతీ 12 ఏళ్లకు ఒకసారి అత్యంత భారీ స్థాయిలో జరిగేది కుంభమేళా. అయితే ఈ మాఘ మేళా మాత్రం ప్రతీ సంవత్సరం నిర్వహిస్తారు. కుంభమేళాలో ఉండే సాధువుల సమాగమం, దానధర్మాలు, హారతులు, ఆధ్యాత్మిక చర్చలు అన్నీ మాఘ మేళాలోనూ ఉంటాయి. కానీ కుంభమేళాతో పోల్చితే.. మాఘ మేళాలో భక్తుల రద్దీ కొంత తక్కువగా ఉంటుంది.

# ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు!

విజయవాడ,తెలంగాణ దిశ :ఆంధ్రప్రదేశ్ శాసనసభలో నైతిక విలువల కమిటీ సమావేశం అయింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు సభా కార్యక్రమాలకు హాజరుకాకుండానే, అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలను పొందుతున్నారనే ఫిర్యాదులపై ఈ కమిటీ చర్చించింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ నిబంధనలను ధిక్కరిస్తూ, సభా కార్యక్రమాలకు గైర్హాజరవుతున్న ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేల తీరుపై ఎథిక్స్ కమిటీ సీరియస్ అయింది. శాసనసభ సమావేశాలకు రాకుం డా పార్టీ నిర్ణయం పేరుతో బయటే ఉంటున్న ఈ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఖజానా నుండి అందే జీతాలు, టీఏ , డీఏ లను మాత్రం క్రమంతప్పకుండా తీసుకుంటున్నట్లు కమిటీ ప్రాథమికంగా గుర్తించింది. ప్రజాప్రతినిధులుగా ప్రజల గొంతుకను సభలో వినిపించాల్సిన బాధ్యతను విస్మరించి, కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం పదవులను వాడుకోవడం నైతికంగా నేరమని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు.



స్పీకర్ కూడా ఈ విషయంలో అత్యంత కఠినంగా ఉండాలని భావిస్తున్నారు. సభకు రావడం అనేది ఎమ్మెల్యేల హక్కు మాత్రమే కాదు, అది వారి ప్రాథమిక బాధ్యత. ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటూ సభను బహిష్కరించడం శాసనసభను అవమానించడమే అని స్పీకర్ కార్యాలయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం, స్పీకర్ అనుమతి లేకుండా వరుసగా 60 రోజుల పాటు సభకు హాజరుకాకపోతే సదరు సభ్యత్వంపై అనర్హత వేటు వేసే అధికారం సభకు ఉంటుంది. అయితే, ఇప్పుడు జీతాల రికవరీ , ఇతర కఠిన చర్యల దిశగా అడుగులు పడుతున్నాయిశాసనసభ నిబంధనల ప్రకారం ఎథిక్స్ కమిటీ స్పీకర్‌కు సిఫారసులు చేసే అవకాశం ఉంది. సభకు హాజరుకాని రోజులకు సంబంధించిన జీతాన్ని, అలవెన్సులను నిలిపివేయడం లేదా రికవరీ చేయడం, నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి నిర్దిష్ట కాలం పాటు సభ నుండి సస్పెండ్ చేయడం, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, నిరంతరం గైర్హాజరవుతున్న వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని సభకు నివేదించడం చేయవచ్చు. ప్రస్తుతం ఈ వ్యవహారంలో ఆ ఆరుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసి, వివరణ కోరాలని కమిటీ నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. వారిచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే వీరిపై కఠిన చర్యలు తీసుకునేలా స్పీకర్‌కు తుది నివేదిక సమర్పించనుంది. విపక్ష హోదా లేదన్న సాకుతో సభకు రాకుండా తప్పించుకుంటున్న ఎమ్మెల్యేలకు ఈ పరిణామం ఒక పెద్ద హెచ్చరికగా మారనుంది.

## టికెట్ ఛార్జీల నిర్ణయం 'వ్యాపార రహస్యం' : భారత రైల్వే



న్యూఢిల్లీ: రైలు టికెట్ ఛార్జీలను నిర్ణయించడానికి ప్రమాణాలను వెల్లడించలేమని భారత రైల్వే తెలిపింది. టికెట్ ఛార్జీలను లెక్కించే పద్ధతిరైల్వేల 'వ్యాపార రహస్యం' మరియు వాణిజ్య సమగ్రతకు సంబంధించిన విషయం అని రైల్వే బోర్డు కేంద్ర సమాచార కమిష న్‌కు తెలియజేసింది. ఛార్జీల నిర్ణయ వివరాలను కోరుతూ సమా చార హక్కు చట్టంకింద దాఖలు చేసిన దరఖాస్తును తిరస్కరించిన తర్వాత రైల్వే బోర్డుఈ వివరణ ఇచ్చింది. బేస్ ఫేర్‌ను లెక్కించే పద్ధతి, డైనమిక్ ధరమరియు టికెట్ ఛార్జీలు ఎలా ప్రభావితమ వుతాయి వంటి సమా చారాన్ని దరఖాస్తుదారుడు కోరాడు. అయితే, ఛార్జీల నిర్ణయ విధానాలు రైల్వేల మేధోసంపత్తి హక్కుల పరిధిలోకి వస్తాయని, సమాచార హక్కు చట్టంలోనిసెక్షన్ 8కింద మినహా యింపు పొందాయని రైల్వే వెల్లడిం చింది. రైల్వేలు వాణిజ్య సంస్థగా పనిచేస్తాయని, లాభాలను ప్రజా ప్రయోజనం కోసం ఉపయో గిస్తున్నందున, అటువంటి సమాచారాన్ని బహిర్గతం చేయడం ప్రజా ప్రయోజనానికి విరుద్ధమని రైల్వే బోర్డు పేర్కొంది.

# అనకాపల్లిపై పట్టు కోసం...

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** సీఎం రమేష్. తెలుగు స్టేట్స్‌లో పాపులర్ లీడర్. గతంలో టీడీపీలో ఉన్నా..ఇప్పుడు బీజేపీలో ఉన్నా..ఆయన స్టైలే వేరు. లాబీయింగ్ చేయడంలో ఆయన తర్వాతే ఎవరైనా అన్న పేరుంది. కడప జిల్లాకు చెందిన సీఎం రమేశ్ ప్రస్తుతం బీజేపీ తరుపున అనకాపల్లి ఎంపీగా ఉన్నారు. గత ఎన్నికల వరకు సీఎం రమేశ్ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచింది లేదు. రాజ్యసభకు నామినేట్ అవుతూ పెద్దల సభకు వెళ్లే వారు. గత ఎన్నికల్లో అదును చూసి మరి..కూటమి ఊపులో నామినేట్ పదవులకు స్వస్తి చెప్పి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. కడప జిల్లా నుంచి వచ్చి అనకాపల్లిలో ఎంపీ ఏంటీ.. అంటూ మొదట కొందరు విమర్శలు చేసినా, సీఎం రమేశ్‌కు వచ్చిన మెజార్టీ చూశాక అప్పట్లో అందరూ షాక్ అయ్యారట. ఫస్ట్ టైమ్ డైరెక్ట్ ఎలక్షన్స్‌లో ఎంపీగా పోటీ గెలిచిన..సీఎం రమేశ్ తన పొలిటికల్ ఫ్యూచర్‌పై డెప్త్‌గా ఫోకస్ పెట్టారట. ప్రజలతో నిత్యం టచ్‌లో లేకపోతే లాంగ్ టర్మ్ పాలిటిక్స్ చేయడం కష్టమని భావించి అనకాపల్లి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారట. అనకాపల్లిని తన పర్మినెంట్ సీటుగా చేసుకునే ప్లాన్ చేస్తున్నారట. ఇకపై తన రాజకీయ క్షేత్రం అనకాపల్లే అంటూ అనుచరులకు సంకేతాలు ఇస్తున్నారట సీఎం రమేష్. చంద్రబాబుకు కుప్పం, జగన్‌కు పులివెందుల తరహాలో సీఎం రమేశ్ అంటే అనకాపల్లి అనేలా గ్రౌండ్ వర్క్ చేసుకుంటూ పోతున్నారట. తనకంటూ ఓ పర్మినెంట్‌గా ఓ సీటు లేకపోతే ఎన్నికలు వచ్చిన ప్రతీసారి నియోజకవర్గాన్ని వెతుక్కోవడం, అక్కడ అంతా సెట్ చేసుకోవడం కష్టమైన పని అని భావిస్తున్నారట. అందుకే అనకాపల్లి ప్రజల మనసును గెలచుకునేలా పనిచేసి..తన సీటును పదిలం చేసుకోవాలని ప్లాన్ చేస్తున్నారట. సీఎం రమేశ్ అనకాపల్లిపై ఫోకస్ పెట్టడానికి రాజకీయ, సామాజిక, ఆర్థిక కారణాలు చాలానే ఉన్నాయన్న టాక్ వినిపిస్తోంది.

అనకాపల్లిలో బీసీ ఓటర్లు అత్యధికం. బీసీలు ఎవరి పక్షనా ఉంటే వారికే పట్టం. సీఎం రమేశ్ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు



కూడా అధికంగానే ఉన్నాయి. టీడీపీకి అనకాపల్లి కంచుకోట. ఇక్కడైతే తనకు ఎలక్షన్ చేయడం చాలా ఈజీ అని సీఎం రమేశ్ భావిస్తున్నారట. అందుకే అనకాపల్లిని తన సొంత, శాశ్వత నియోజకవర్గంగా చేసుకునే ఎత్తుగడ వేస్తున్నారట. క్యాంప్ ఆఫీస్ పెట్టి నిత్యం ప్రజలకు తన తరుపున.. అధికారులు, అనుచరులు అందుబాటులో ఉండేలా చూస్తున్నారట. తరుచూ నియోజవకర్గంలో పర్యటిస్తూ.. శుభకార్యాలు, పరామర్శలు ఉంటే నేరుగా సీఎం రమేశే హాజరవుతున్నారట. ఆయన అందుబా టులో లేకపోతే, తన సోదరుడు లేకపోతే కుమారుడు నియోజకవర్గ వ్యవహారాలు చూసుకుంటున్నారట.

అయితే అనకాపల్లి జిల్లాలో అర్సలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్కు, డేటా సెంటర్, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా ప్రాజెక్టులు రానున్నాయి. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ అనుమతులుతో రావాల్సినవే.

ఈ ప్రాంతఅభివృద్ధికి తనవంతు చేస్తున్న కృషిని కూడా సీఎం రమేశ్ గట్టిగానే ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే అనకాపల్లి అంటేసీఎం రమేష్ అని గుర్తుకొచ్చేలా ఎత్తులు వేస్తున్నా రనే టాక్ ఇటీవల ఊపందుకుంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నికలప్పు డు లోకల్,నాన్ లోకల్ స్లోగన్ బలంగా వినిపిస్తుంటుం ది. ప్రత్యర్థులు,సొంత పార్టీలో ఉండే ఆశవాహులు వాడే లోకల్, నాన్ లోకల్ వెపన్‌ను సీఎం రమేష్ ఎలా ఫేస్ చేస్తారో చూడాలి.

## తెరపైకి కొత్త నేతలు

**నెల్లూరు,తెలంగాణ దిశ :** కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్ల సమయం దగ్గరపడు తున్న కొద్దీ కొందరు మంత్రుల్లో టెన్షన్ ఎక్కువగా ఉంది. ప్రధానంగా ఇద్దరు మంత్రుల్లో టెన్షన్ ఎక్కువగా కనపడుతుంది. ఇద్దరు మంత్రులు ఇప్పుడు ఏవిషయంలోనూ వెనక్కు తగ్గడం లేదు. ఇప్పటివరకూ కొంత మౌనంగా ఉన్నప్పటికీ త్వరలో జరిగే మంత్రి వర్గ విస్తరణలో తమ పదవికి గండం ఏర్పడుతుందనుకున్నారో.. ఏమో..ఈ ఇద్దరు మాత్రం తరచూ మీడియాలో కనిపిస్తున్నారు. ప్రధానంగా విపక్ష నేత వైఎస్ జగన్ పై విమర్శలు చేయడంలో వీరిద్దరూ ముందుంటున్నారు. నిన్న మొన్నటి వరకూ వంగలపూడి అనిత లేకుంటే.. నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు వంటి వారు మాత్రమే ఎక్కువ విమర్శలు చేసేవారు. ఇక నారాయణ సరేసరి. తాజాగా ఈ జాబితాలోకి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, సవిత చేరిపోయారు. ఏవిషయంలోనూ వీరు వెనక్కు తగ్గకుండా తాము జగన్ ను విమర్శించడంలో ముందున్నామని చెప్పకనే చెబుతు న్నారు. నిన్న మొన్నటి వరకూ ఆయన శాఖపై మాత్రమే స్పందించేవారు. కానీ మంత్రివర్గ విస్తరణలో ఆనం ను త ప్పించి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కానీ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. మరొకవైపు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు నుంచి ఆనంను తప్పించి వీరిలో ఒకరికి చంద్రబాబు కేబినెట్ లో స్థా నంకల్పించే ఛాన్స్ ఉందన్న ప్రచారం తో ఆనం అలెర్ట్ అయినట్లు కన పడుతుందిఇక మరొక మంత్రి ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సవిత కూడా ఈ మధ్య కాలంలోయాక్టివ్‌గా ఉన్నారు.

# భారత్ చుట్టూ సమస్యలు!

ప్రపంచ రాజకీయాల్లో మార్పు సంకేతాలు కనిపించాయి. ప్రపంచం ఒక కొత్త అధ్యాయం దిశగా కదులుతున్నట్టు అనిపించింది. కొత్త నిర్మాణాన్ని రూపొందించే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్‌లో ఈ ఏడాది జరిగేఎన్నికలు ఆయా దేశాల అంతర్గత అంశాలు మాత్రమే కాదు. ఈ ఎన్నికలు దక్షిణాసియా స్థిరత్వం, భారత భద్రతా సమస్యలు, ప్రాంతీయ సమతుల్యత వంటి అంశాలతో లోతుగా ముడిపడి ఉన్నాయి. మరోవైపు, యుక్రెయిన్- రష్యా యుద్ధం ఇకపై యూరప్‌కు మాత్రమే పరిమితమైన వివాదం కాదు. ఇది ప్రపంచ ఇంధన సరఫరాలు, ఆహార భద్రత, అంతర్జాతీయ నైతిక విలువలకు తీవ్ర మైన పరీక్షగా మారింది. భారత్ ఇప్పటివరకూ చర్చలు, సమన్వయ ం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి విధానాన్ని అనుస రిస్తోంది.

భారత్ స్పష్టంగా ఏదో ఓవైపు ఉండాల్సి వస్తుందా? భారత్ చాలా కాలంగా 'బహుళ ధ్రువ ప్రపంచ క్రమం' గురించి మాట్లాడు తోంది. అంటే అధికారం కొన్ని దేశాల చేతుల్లో మాత్రమే కేంద్రీకృతమై ఉండని ప్రపంచం. అయితే 'బహుళ ధ్రువ ప్రపంచం' అనేది ఒక ఆలోచన మాత్రమేనా, లేదా అది నిజంగా వాస్తవ రూపం దాల్చగలదా? ఈ చర్చలో భారత్ - చైనా సంబంధాలు కూడా కేంద్రబిందువ య్యాయి. ఒకవైపు, రెండు దేశాలు ఆర్థికపరంగా ఒకదానిమీద ఒకటి బాగా ఆధారపడి ఉన్నాయి.

మరోవైపు సరిహద్దు ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. వ్యూహాత్మక అపనమ్మకం పెరుగుతోంది. చర్చలకు మార్గాలు తెరిచే ఉన్నప్పటికీ, అదే సమయంలో అపనమ్మకం స్పష్టంగా ఉంది. భారత విదేశాంగ విధానం కూడా ఆర్థిక రంగంలో కొత్త దశలోకి ప్రవేశించింది. అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పం దాలు ప్రారంభమవుతున్నాయి. అమెరికాతో వాణిజ్య సంబంధాల్లో సవాళ్లు కొనసాగుతున్నాయి. గత ఏడాది ప్రారంభంలో, డోనల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన్ను కలిసిన మొదటి నలుగురు ప్రపంచ నాయకులలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఒకరు. ఈ సమావేశంలో మోదీని తన "గొప్ప స్నేహితుడు" అని ట్రంప్ అభివర్ణించారు. అయితే కొన్నినెలలుగా మోదీ, ట్రంప్ మధ్య సంబంధాలు ట్రంప్ మొదటి పదవీకాలంలో కనిపించినంతగా లేవు. ఈ మారుతున్న వాతావరణంలో ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై రెండు రకాల సుంకాలను విధించింది. ఒకటి వాణిజ్య కారణాలతో, ఇంకొకటి రష్యా నుంచి చమురు కొంటున్నం దుకు. భారత్‌పై అమెరికా మొత్తం 50 శాతం సుంకాలు విధించింది. ఆసియా దేశాలలో విధించిన అత్యధిక సుంకం ఇది.

ఆస్ట్రేలియాతో చర్చలు మంచిస్థాయిలో ఉన్నాయి. న్యూజీలాండ్, ఒమన్‌లతో ఒప్పం దాలు కుదిరాయి. యూకేతో యూరోపియన్ యూనియన్‌తో, ఆ తర్వాత అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరితే భారత్‌కు చాలా ఉపశమనం కలుగుతుంది..నేపాల్‌లో సార్వత్రిక ఎన్నికలు 2026 మార్చి 5న జరగనున్నాయి. బంగ్లాదేశ్‌లో 2026 ఫిబ్రవరి 12న ఎన్నికలు జరుగుతాయి. రెండూ భారత్‌కు పొరుగు దేశాలు, వ్యూహా త్మకంగా ముఖ్యమైనవిగా పరిగణిస్తారు. ఇటీవలి సంవత్సరాలలో, ఈ రెండు దేశాలతో భారత సంబంధాలు మునుపటిలా సజావుగా లేవు. మరి.. నేపాల్, బంగ్లాదేశ్‌లో ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వా లు ఏర్పడితే, భారత్ తన సంబంధాలను పునరుద్ధరించుకో వడానికి అవకా శం దక్కుతుందా? బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరిగిన సంఘటనలను పరిగణనలోకి తీసుకుంటే అక్కడి ఎన్నికలు భారత్‌కు చాలా ముఖ్యమైనవి" ఎన్నికల తర్వాత ఏ కొత్తప్రభుత్వం ఏర్పడినా, భారత్ దానితో సంబంధాలను బలోపేతం చేసుకోవడా నికి ప్రయత్నించాలని ఆయన భావిస్తున్నారు. షేక్ హసీనా ప్రభు త్వాన్ని ప్రస్తావిస్తూ, ఆ సమయంలో రెండు దేశాల మధ్య సంబంధాలు చాలా బలంగా ఉన్నాయన్నారు.

కానీ,భారత్ ఒక పెద్దవ్యూహాత్మక తప్పు చేసిందనే వాదన ఉంది,షేక్ హసీనా అధికారంలో ఉన్నప్పుడు సంబంధాలు చాలా బాగుండేవి. కానీ, బీఎన్‌పీ, ప్రతిపక్ష పార్టీలతో సంబంధాలకు ప్రయత్నించక పోవడం తప్పు. ఒకప్పుడు మనకు మంచి పొరుగు దేశం, మిత్రుడైన బంగ్లాదేశ్‌ను ఇపుడు మనం కోల్పోయాం. ఇప్పుడు తీసుకురావడం చాలాముఖ్యం" అనిఅన్నారు. భారత్ తన విదేశాంగ,వాణిజ్య విధానంలో వైవిధ్యాన్ని కొనసాగిం చాలని ఆమె సూచించారు. భారత్ అనేక దేశాలతో సంబంధాలను కొనసాగించాలి, ఏదేని విషయం కోసం ఒకే దేశంపై ఆధారపడ కుండా ఉండాలి. ఒకే దేశంపై ఆధారపడితే, అది సమస్యలను సృష్టించవచ్చు" అన్నారు అర్పితా ముఖర్జీ. భారత్ చాలాకాలంగా రష్యాతో మంచి సంబంధా న్ని కలిగి ఉంది. చైనాప్రపంచ సూపర్ పవర్‌గా మారుతోంది. కీలకమైన ఖనిజాలు, ఆయుధాలలో దాని పాత్రను చాలా ఉంది, అమెరికా ఎజెండాను పరిశీలిస్తే, అది 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అంటే 'మాగా'. ఈ ఎజెండా కింద, అది దాదాపు అన్ని దేశాలపై సుంకాలను విధిం చింది" అమెరికా సుంకాలు విధించినప్పుడు, ఎవరు మిత్రుడు, ఎవరు శత్రువు అని చూడలేదు భారత్ ఎల్లప్పుడూ చైనాతో మంచి, బలమైన సంబంధాలను కొనసాగించాలి. వాణిజ్య సమతుల్యత మనకు వ్యతిరేకంగా ఉండటమే. ప్రస్తుత కాలంలో అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్‌తో వ్యవహరించడంలో ఏ దేశ విదేశాంగ విధానానికైనా పెద్ద పరీక్షే. 2023లోఅధ్యక్షుడు బైడెన్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని యూఎస్ పర్యటనకు ఆహ్వానించారు. చాలా తక్కువ మంది ప్రపంచ నాయకులకు దక్కిన గౌరవమది" అని ఆయన గుర్తుచేశారు. ప్రధాని మోదీ అయినా లేదా అధ్యక్షుడు షీజిన్‌పింగ్ అయినా, ప్రతి ఒక్కరికీ వారి సొంత అహం ఉంటుంది. కానీ,అతిపెద్ద అహం ట్రంప్. ఆ అహాన్ని ఎవరు డీల్ చేస్తారు, ఎలాచేస్తారనేది ప్రశ్న. బ్రిటన్ దీన్ని చేయగలిగింది.

# భూభారతిలోనూ...అవే లోపాలు!






హైదరాబాద్,,తెలంగాణ దిశ :బీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి ఒక ప్రధాన కారణమైన ధరణి పోర్టల్‌లోని లోపాలను సరిదిద్ది, పారదర్శకమైన భూ రికార్డుల నిర్వహణ కోసం ప్రస్తుత ప్రభుత్వం భూభారతిని ఎంతో ఆర్భాటంగా తీసుకువచ్చింది. అయితే, ఆచరణలో ఈ కొత్త వ్యవస్థ కూడా పాత రోగాలనే ప్రదర్శిస్తుండటం ఇప్పుడు రైతాం గాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవల జనగామ, యాదాద్రి జిల్లాల్లో వెలుగుచూసిన చలాన్ల కుంభకోణం ఈ వ్యవస్థలోని సాంకే తిక లొసుగులను బట్టబయలు చేసింది. పేరు మార్చారు కానీ, అక్రమార్కులు చొరబడే మార్గాలను మాత్రం మూసివేయలేకపో యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.భూభారతి వెబ్‌సైట్‌లోఎడిట్ ఆప్షన్లను వాడుకుని నిందితులు ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపా యల గండి కొడుతున్నారు. కేవలం సాఫ్ట్‌వేర్ కోడింగ్‌లో ఉన్న లోపాల వల్ల అక్రమార్కులు చలాన్ల విలువను మార్చి, ప్రభుత్వానికి తక్కువ డబ్బు చెల్లిస్తూ రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిం ది పోయి, సమస్య బయటపడినప్పుడు మాత్రమే స్పందిస్తూ అండర్ ప్లే చేస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి.

లోపాలను ఆదిలోనే గుర్తిం చి అరికట్టడంలో ఐటీ విభాగం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. క్షేత్రస్థా యిలో రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. భూముల మార్పిడి, వారసత్వ సంక్రమణ, పట్టాదారు పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణ వంటి అంశాల్లో భూభారతి ఇంకా వేగం పుంజుకోలేదు. స్లాట్ బుకింగ్ దొరకకపోవడం, డాక్యుమెంట్లు అప్‌లోడ్ కాకపోవడం వంటి సాంకేతిక సమస్యలతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ధరణిలో ఉన్న సమస్యలే ఇక్కడా కొనసాగుతున్నాయి, మాకు ఒరిగిందేమిటి అని రైతులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణ లోపించడం వల్ల మధ్యవర్తులు మళ్లీ రంగప్రవేశం చేసి రైతులను నిలువునా దోచుకుంటున్నారు.గత ఎన్నికల్లో ధరణిపై ఉన్న ప్రజా వ్యతిరేకతను బీఆర్ఎస్ ప్రభుత్వం తక్కువ అంచనా వేసి భారీ మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు అదే బాటలో భూభారతి వల్ల వచ్చే ఫిర్యాదులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భూమి అనేది సగటు మనిషికి అత్యంత సెంటిమెంట్ , ఆర్థిక మూలాధారం. అక్కడ చిన్న తప్పు జరిగినా అది పాలనపై తీవ్ర వ్యతిరేకతకు దారి తీస్తుంది. భూభారతి పట్ల పెరుగుతున్న అసంతృప్తిని ప్రభుత్వం సకాలంలో గుర్తించకపోతే, అది రాబోయే ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వానికి చేదు అనుభవాలను మిగిల్చే అవకాశం ఉంది.అసలు ఇలాంటి స్కాములు ఎందుకు జరుగుతున్నాయి? వ్యవస్థలో పారదర్శకత ఎక్కడ లోపిస్తోంది? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. కేవలం ఒక పోర్టల్‌ను మార్చి మరొకటి తీసుకురావడం వల్ల ప్రయోజనం ఉండదు. అది పటిష్టమైన భద్రతతో, సామాన్యుడికి అర్థమయ్యేలా ఉండాలి. అధికారులు, ఐటీ నిపుణులు నిరంతరం పర్యవేక్షించని పక్షంలో ఏ వ్యవస్థ అయినా అక్రమార్కులకు అడ్డాగా మారుతుందన్న ఆందోళన కనిపిస్తోంది.

# ఆ గ్రామ జనాభా 1,500.. 3 నెలల్లో 27,000కుపైగా జననాలు!



ముంబై: ఆ గ్రామ జనాభా కేవలం 1,500. అయితే మూడు నెలల్లో 27,000కు పైగా జననాలు అక్కడ నమోదయ్యాయి. ఈ విషయం తెలుసుకుని అధికారులు షాక్ అయ్యారు. అతిపెద్ద జనన ధృవీకరణ పత్రాల స్కామ్ జరిగినట్లు గుర్తించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అర్ని తహసీల్‌లోని షెందురుసాని గ్రామ పంచాయతీ జనాభా కేవలం 1,500. అయితే ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి నవంబర్ మధ్య కేవ లంమూడు నెలల్లోనే 27,397 జననాలు ఆ గ్రామంలో నమోదయ్యా యి. కాగా,ఈ విషయం తెలిసిజిల్లా ఆరోగ్యఅధికారులుషాక్ అయ్యా రు. ఆ గ్రామాన్ని సందర్శించారు. అసాధారణ రీతిలో నమోదైన జననాల ధృవీకరణ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీంతో అతిపెద్ద జనన ధృవీకరణ పత్రాల స్కామ్ బయటపడింది. జనన, మరణ నమోదు వ్యవస్థ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్)ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసినట్లు గుర్తించారు.

గ్రామ పంచాయతీ సీఆర్ఎస్ లాగిన్ ఐడీ ముంబైకి మ్యాప్ అయ్యిందని తెలుసుకుని అధికారులు షాక్ అయ్యారు. మరోవైపు జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కూడా పంచాయతీ శాఖ డిప్యూటీ సీఈవో ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. మూడు నెలల్లో నమోదైన 27,397 జననా లు, ఏడు మరణాలు గ్రామపంచాయతీ పరిధికి వెలుపలఉన్నట్లు ఆ కమిటీ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో జిల్లా ఆరోగ్య అధికారి ఈ స్కామ్‌పై యావత్మల్ నగర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఐటీ చట్టంతోపాటుపలు సెక్షన్ల కింద కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బీజేపీసీనియర్ నేత కిరీట్‌సోమయ్య ఆ గ్రామాన్ని సందర్శి ంచారు. అక్కడ నమోదైన జననాల్లో 99 శాతం పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తులవేనని తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌తో మాట్లాడినట్లు చెప్పారు. ఈ జననాల నమోదు లన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

# మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు లేని అదనపు ఫ్లోర్ ల నిర్మాణాలు!

హైదరాబాద్,తెలంగాణ దిశ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు లేని అదనపు ఫ్లోర్ ల నిర్మాణాలు, సెల్లార్ లు, పార్కింగ్ స్థలాల్లో అక్రమ నిర్మాణాల వలన అపార్ట్మెంట్ ల లోని అనేక రకాలుగా ఇబ్బందులకు గురి అవుతున్నారని, కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్య వైఖరి పై లింగం పెల్లి అపార్ట్మెంట్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. లింగం పెల్లి రెసిడెన్షియల్ అపార్ట్మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు యన్. విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన వినియోగదా రుల చైతన్య సదస్సు లో వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, కంస్యూమర్స్ కాన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు మామిడి భీం రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరైనారు. లింగం పెల్లి లోని పలు అపార్ట్మెంట్ లతో పాటు, బి.యస్.హాబిటెంట్ అపార్ట్మెంట్ లో అనుమతి లేని ఆరవ ఫ్లోర్ వల్ల వాటర్ ట్యాంక్ కు బీటలు ఏర్పడి కూలిపోయే పరిస్థితి, లిఫ్ట్ సరిగా పనిచేయక పోవడం, అక్రమ నిర్మాణాల వల్ల ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ సంవత్సరాల కొలది పెండింగ్లో ఉంచడం, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేని క్రమంలో త్రాగునీటి చార్జీలు ఎక్కువగా చెల్లించడం జరుగుతున్న దని అపార్ట్మెంట్ వినియోగదారులు నేటి సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. అపార్ట్మెంట్ లో అనుమతి లేని నిర్మాణం పై గత రెండుసంవత్సరాల క్రితం తేది 21-10-2023 నుండి ఇప్పటి వరకుశేర్ లింగంపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా కూడా అక్రమ నిర్మాణాలను తొలగించడం లేదని, వినియోగదారులు సదస్సు లో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భ ంగా వినియోగదారుల నుండి ఫిర్యాదులను సేకరించిన మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ, అపార్ట్మెంట్ ల చట్టం 1987, భవన నిర్మాణ నిబంధనలు 2012 ల ప్రకారం అనుమతులు పొందిన విధంగా నిర్మాణాలు జరగాలని, లేనట్లయితే అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు లు అందిన (15) రోజుల్లో అక్రమ నిర్మాణాలను కార్పొరేషన్ అధికారులు కూల్చి వేయాల్సి ఉంటుందని తెలిపారు. అయితే రెండు సంవత్సరాలుగా వినియోగదారుల సమస్యలను పట్టించుకోని కార్పొరేషన్ అధికారులపై లోకాయుక్త లో ఫిర్యాదు చేస్తున్నట్లు సాంబరాజు చక్రపాణి తెలిపారు. అపార్ట్మెంట్ ల చట్టం ప్రకారం ప్రతీ అపార్ట్మెంట్ లో "అపార్ట్మెంట్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్" తప్పనిసరి గా ఏర్పడాలని సి.సి.ఐ.రాష్ట్ర అధ్యక్షుడు మామిడి భీం రెడ్డి తెలిపారు. అపార్ట్మెంట్ అసోసియేషన్ ఏర్పాటు జరిగితేనే బిల్డర్ నుండి హక్కుల బదలాయింపు ఆస్కారం ఏర్పడుతుందని అన్నారు. లింగం పెల్లి లో అపార్ట్మెంట్ అక్రమ నిర్మాణాలు విపరీతంగా పెరిగిపోవడం పై న్యాయపరమైన చర్యలకు వినియోగదారుల రక్షణ చట్టాల ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం అపార్ట్మెంట్ చట్టాలకు సంబంధించిన అవగాహన పోస్టర్ ను విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో వివిధ ఫ్లాట్ ఓనర్స్ కార్యవర్గ సభ్యులు యస్. రాము, బి. నవీన్ కుమార్, యం.ఉదయ్ కుమార్, డి.క్రిష్ణ మోహన్, యన్. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ సభ్యులు న్యాయ వాది సాజీదా ఖాన్, ఫరా సుల్తానాలు సదస్సులో పాల్గొన్నారు.

# ఓయాసిస్ జనని యాత్ర వరంగల్

వరంగల్,తెలంగాణ దిశ :భారతదేశంలో అత్యంత విశ్వసనీయ రీప్రొడక్టివ్ మెడిసిన్ సంస్థల్లో ఒకటైన ఓయాసిస్ ఫెర్టిలిటీ, దేశవ్యాప్తంగా ఫెర్టిలిటీ అవగా హన పెంచే లక్ష్యంతో చేపట్టిన ఓయాసిస్ జనని యాత్ర వరంగల్ చేరింది. టైర్ ఎ, ఈ, ఎఎఎ ప్రాంతాల్లో ఫెర్టిలిటీ అవగాహన, నిపుణుల మార్గదర్శకం, ఫెర్టిలిటీ స్క్రీనింగ్ సేవలను నేరుగా ప్రజలకు అందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. జీవనశైలి మార్పులు, ఆలస్య వివాహాలు, శాస్త్రీయ అవగాహన లోపం వంటి కారణాలతో ఫెర్టిలిటీ సమస్యలు పెరుగుతున్న వేళ ఓయాసిస్ జనని యాత్ర బస్సు దంపతులకు ఉచిత ఫెర్టిలిటీ సలహాలు, ఉచిత ఎ ఎం హెచ్ పరీక్ష, వీర్య పరీక్ష, హీమోగ్లోబిన్ పరీక్షలు వంటి సేవలను అందిస్తోంది.

శుభ్రమైన, సురక్షితమైన నమూనా సేకరణ ప్రాంతాలతో ఈ సేవలు మరింత సౌకర్యవంతంగా అందిస్తున్నారు. ఫోర్ట్ వరంగల్ తర్వాత ఈ జనని యాత్ర, తెలంగాణ రాష్ట్రంలో భూపాలపల్లి, జమ్మికుంట, మహబూబాబాద్ ప్రాంతాలకు వెళ్లి మరింత మంది ప్రజలకు అవగాహన కల్పించనున్నా రు. డా. దుర్గా జి.రావు, మెడికల్ డైరెక్టర్ ఒ కో–ఫౌండర్, ఓయాసిస్ ఫెర్టిలిటీ, "సైన్స్ ఫెర్టిలిటీ రంగాన్ని మారుస్తున్న ఈ సమయంలో, ఓయాసిస్ జనని యాత్ర ఆధునిక, సాక్ష్యాధారిత ఫెర్టిలిటీ గురించిన సమాచారాన్ని సమాజాల

మధ్యకు నేరుగా తీసుకెళ్తోంది. ఫెర్టిలిటీ యాత్రను ప్రారంభిస్తున్న దంపతులకు తొందరగా వైద్య మార్గదర్శకాన్ని అందించడం ద్వారా భవిష్యత్తుకు ఆరోగ్యకరమైన మార్గం సృష్టిస్తుంది.

" అని వ్యక్తపరిచారుపుష్కరాజ్ షెనాయ్, సీఈఓ, ఓయాసిస్ ఫెర్టిలిటీ, "భారతదేశ ఫెర్టిలిటీ రేటు నిరంతరం పడిపోతున్న ఈ సమయంలో, సమయానుకూలమైన, అందుబాటులో ఉన్న ఫెర్టిలిటీ సంరక్షణ మరింత ముఖ్యమైంది. నిపుణుల కన్సల్టేషన్, డయగ్నస్టిక్స్, అవసరమైన మార్గదర్శకంతో 'గుడ్ హ్యాండ్స్ ఆఫ్ సైన్స్'ను గ్రామీణ స్థాయికి విస్తరించుతున్నాం. ప్రతి జంట సరైన నిర్ణయాలు తీసుకునేలా సకాలంలో సహాయం అందించడం మా ధ్యేయం." అని తెలిపారు.

కావ్య రావు జలగం, రీజినల్ మెడికల్ హెడ్ ఒ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, "మునుపటి జనని యాత్రకు వచ్చిన అపార స్పందన దంపతులు సరైన మార్గదర్శకాన్ని ఎంత విలువగా తీసుకుంటారో చూపించింది. ఇంకా ఫెర్టిలిటీపై అవగాహన తక్కువగా ఉన్న ఈ ప్రాంతాల్లో సరైన సమాచారం, సానుభూతితో కూడిన సహాయాన్ని అందించడం మా ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం." అని అన్నారు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో కొత్త రూల్..!



హైదరాబాద్,తెలంగాణ దిశ : హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్, పట్టణ అభివృద్ధిని ప్రభావితం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 10 అంతస్తులు దాటి నిర్మించే భవనాలకు టీడీఆర్ కొనుగోలు తప్పనిసరి చేసింది. చెరువులు, నదుల పరిరక్షణకు భూసేకరణను వేగవంతం చేసేందుకు ఆకర్షణీయమైన టీడీఆర్ ప్యాకేజీని ప్రకటించింది.హైదరాబాద్ మహానగరంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని, పట్టణ అభివృద్ధిని ప్రభావితం చేసేలా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని చెరువులు, నదుల పరిరక్షణతో పాటు మౌలిక సదుపాయాల కల్పన కోసం భూసేకరణను వేగవంతం చేసేందుకు 'టీడీఆర్' నిబంధనలను సవరిస్తూ పురపాలక శాఖ జీవో నం.16ను విడుదల చేసింది. ఈ కొత్త ఉత్తర్వులు ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 300 డివిజన్లకు వర్తిస్తాయి.కొత్త నిబంధనల ప్రకారం.. నగరంలో 10 అంతస్తులు దాటి నిర్మించే ప్రతి భవనానికి టీడీఆర్ కొనుగోలు తప్పనిసరి చేశారు. 11వ అంతస్తు నుంచి పై అంతస్తుల వరకు మొత్తం నిర్మాణ విస్తీర్ణంలో 10 శాతానికి సమానమైన టీడీఆర్ సర్టిఫికెట్లను బిల్డర్లు సమర్పించాల్సి ఉంటుంది. దీనివల్ల మార్కెట్‌లో నిల్వ ఉన్న టీడీఆర్ బాండ్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతుంది. ఒకవేళ బిల్డర్లు తమ భూమిని ప్రభుత్వానికి ఉచితంగా అప్పగిస్తే.. వారికి సెట్‌బ్యాక్, భవన ఎత్తు నిబంధనలలో ప్రత్యేక సడలింపులు కూడా కల్పిస్తారు.చెరువులు, నదుల సమీపంలోని పట్టా భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం ఆకర్షణీయమైన ప్యాకేజీని ప్రకటించింది. ఎఫ్‌టీఎల్ పూర్తిస్థాయి నీటి మట్టం పరిధిలోని భూములకు 200 శాతం టీడీఆర్, చెరువుల బఫర్ జోన్లలోని భూములకు 300 శాతం టీడీఆర్, బఫర్ వెలుపలి భూములు అభివృద్ధి కోసం సేకరిస్తే ఏకంగా 400 శాతం టీడీఆర్ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే, భూసేకరణ విస్తీర్ణం ఒక ఎకరా కంటే ఎక్కువగా ఉంటే ఆ దరఖాస్తును ప్రభుత్వం నేరుగా పరిశీలిస్తుంది. మూసీ నది పరీవాహక ప్రాంతం, చెరువుల సుందరీకరణకు భూ యజమానుల నుంచి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడానికి ఈ నిర్ణయం దోహదపడనుంది.

గతంలో జారీ చేసిన సుమారు రూ. 10 వేల కోట్ల విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు మార్కెట్‌లో పేరుకుపోయి, వాటి విలువ పడిపోయింది. ఫలితంగా యజమానులు భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తూ నగదు పరిహారం కోరుతున్నారు. ఇప్పుడు పెద్ద భవనాల నిర్మాణానికి టీడీఆర్ తప్పనిసరి చేయడం వల్ల, బిల్డర్లు వీటిని కొనుగోలు చేయక తప్పదు. దీనివల్ల మార్కెట్‌లో టీడీఆర్ ధర పెరగడంతో పాటు, ప్రభుత్వంపై నగదు పరిహారం భారం తగ్గుతుంది. తద్వారా నిధుల కొరతతో ఆగిపోయిన రోడ్ల విస్తరణ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులు వేగవంతం కానున్నాయి.

# సమాజంలో మార్పు విద్యతోనే సాధ్యం



క్లాసు రూంలో పాఠాలు చెబుతున్న ఆ ప్రొఫెసర్.. ఆ తరగతి పిల్లలకి అధ్యాపకురాలు మాత్రమే కాదు.. వారిలో దాగున్న ఎన్నో ప్రశ్నలకి సమాధానం. సమాజం నుండి ఎంతో వివక్షని ఎదుర్కొన్న తను చెప్పే పాఠాలు ఆ పిల్లల మెదళ్లల్లో సమాజంలో తనలాంటి వాళ్లని చూసే చూపుని మారుస్తుంది. గౌరవాన్ని కలిగిస్తుంది. క్యాంపస్‌లో ఆమె వేసే ప్రతి అడుగులో చూస్తున్న వారికి, వింటున్న వారికి, గౌరవిస్తున్న వారికి ప్రతి ఒక్కరికీ ఆమె సాధించిన విజయం కనిపిస్తుంది. ఎందుకంటే ఆ ప్రొఫెసరమ్మ ట్రాన్స్‌జెండర్. తమిళనాడు లయోల కాలేజీలో ఈ ఏడాది జూన్ నుండి అసిస్టెంట్ ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె పేరు డాక్టర్ ఎన్. జెన్సీ.

తమిళనాడు చరిత్రలో ఉన్నతవిద్యలో అర్హత సాధించిన, ఉన్నత కొలువు దీరిన మొట్టమొదటి ట్రాన్స్.. జెన్సీ. ఒకప్పుడు విద్యాలయం నుండి గెంటివేయబడిన తను ఈరోజు ఆ విద్యాలయంలోనే గౌరవమ ర్యాదలు పొందుతున్న హోదాలో ఉన్నారు. ఇంగ్లీష్ లిటరేచర్‌లో పిహెచ్‌డి చేసిన జెన్సీకి అధ్యాపక వృత్తి అంటే ఎనలేని ప్రేమ. పిల్లలని విద్యావంతులని చేసి, సమాజాన్ని చైతన్యం చేయాలన్న లక్ష్యం ఆమెది. విద్య తనలాంటి వారిని ఎంత అందలం ఎక్కిస్తుందో ఆమె నిరూపించ లానుకున్నారు. అందుకే ఎన్నో కష్టనష్టాలు పడి, అవమానాలు ఎదుర్కొని మరీ డాక్టరేట్ సాధించారు. అయితే ఈ విజయం పట్ల ఆమె సంతోషంగా లేరు. ట్రాన్స్ వ్యక్తుల పట్ల సమాజం చూపే వివక్ష పోయినప్పుడే తనకి ఆనందమని ఆమె పదే పదే చెబుతారు.

'ఈ సమాజం ట్రాన్స్ వ్యక్తులని భిన్నంగా చూస్తుంది. ఇంటి నుండి గెంటేయాలని చెబుతుంది. కానీ ట్రాన్స్ వ్యక్తులని చదివించండి' అని ఆమె అంటారు. ప్రొఫెసర్‌గా ఉన్న ఆమె తనలాంటి వారి పట్ల సమాజం ద ృష్టికోణం మార్చించాలని నిరంతరం శ్రమిస్తున్నారు. టెడ్ స్పీకర్‌గా విద్యాసంస్థలు, సామాజిక వేదికలు, ప్రజా వేదికలలో 50కి పైగా ప్రేరణాత్మక ఉపన్యాసాలు ఇచ్చి సమాజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తన కమ్యూనిటీ వ్యక్తులు ఎదుర్కొనే పలు సమస్యలపై కూడా ఆమె పనిచేస్తున్నారు. సాధారణంగా ఏదేని గుర్తింపు పత్రాల్లో లింగనిర్ధారణ ముఖ్యంగా చేస్తారు. అయితే ట్రాన్స్ వ్యక్తులు మొదట ఉన్న గుర్తింపు తరువాతి కాలంలో మార్చుకోవాల్సి వస్తుంది. ఇది అంత సాధారణమైన ప్రక్రియ కాదు. ఎన్నో ఇబ్బందులు పడాలి. జెన్సీ ఆ సమస్యలను పరిష్కరించి కమ్యూనిటీ వ్యక్తులకి సాయం చేస్తున్నారు. అంతేకాదు, సామాజికంగా, విద్యాపరంగా ఎదుర్కొనే సమస్యలపై సలహాలు ఇస్తున్నారు. దీనిపై ఆమె ఇలా అన్నారు. 'ఈ ప్రయాణంలో నేను ఎన్నో ఇబ్బందులు పడ్డాను. పోరాడాను. నా తరువాత వచ్చేవారికి ఈ సమస్యలు పునరావృతం కాకూడదు. అందుకే సాయం చేస్తున్నాను'. ప్రొఫెసర్‌గా, సామాజిక కార్యకర్తగా రెండు బ ృహత్తర బాధ్యతల్లో తలమునకలైన జెన్సీ ఈ ప్రయాణంలో ఎంత ముందుకు వెళ్లారంటే.. ఇటీవల పేదపిల్లలకి అవార్డు ప్రదానం చేస్తున్న ఓ జంట, ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెన్సీని పిలిచారు. అప్పుడు 'సమాజంలో ఈ మార్పు రావాలనే నా ప్రయత్నం. ఇది అన్ని చోట్లా రావాలి' అంటూ ఎంతో ఉద్వేగంగా మాట్లాడారు. సమాజంలో ఇంతటి ప్రభావం చూపిస్తున్న జెన్సీ ఇప్పుడు తన కమ్యూనిటీకే కాదు. ఎంతోమందికి స్ఫూర్తిమంతంగా కనిపిస్తున్నా రు. కాలేజీ క్యాంపస్‌లో విద్యార్థులు తనని పాఠాలు చెప్పే అధ్యాపకు రాలిగానే కాదు, 'అంతకు మించిన వ్యక్తి' అని కొనియాడుతారు. 'ఆమె చూపించే ప్రభావం పాఠాలకి మించి ఉంటుంది' అంటారు. 'ఎన్నో సమస్యల అడ్డుగోడలని బద్దలు చేయగల ఏకైక సాధనం విద్య' అని ఆమె నిరూపించింది అని అభివర్ణిస్తారు.

# విడదల అటు... రోజా ఎటూ



తిరుపతి,తెలంగాణ దిశ :ఏదైనా అధికారంలో ఉన్నప్పుడు ఏది చేసినా చెల్లుబాటు అవుతుంది. అధినేతకు ధిక్కారం ఉండదు. ఎదిరించేవారు అస్సలు ఉండరు. కానీ అది అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే. అధికారం కోల్పోయిన తరువాత విధేయత అనేది పక్కకు వెళ్ళిపోతుంది. రాజకీయం అంటే కేవలం అవసరం అన్నట్టు పరిస్థితి మారిపోతుంది. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి విషయంలో అదే జరిగింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత ఒక్కొనేత ఆ పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి అడుగులు వేసిన నేతలు సైతం జగన్మోహన్ రెడ్డిని విడిచిపెట్టి వెళ్ళిపోతున్నారు. ఆ పరిస్థితిని చూస్తున్న అధినేత జగన్మోహన్ రెడ్డి సైతం ఆశ్చర్యపోతున్నారు. గత కొద్దిరోజులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు మహిళ నేతలు అసలు తాడేపల్లికి రావడం మానేశారట. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన చర్చ అయితే జరుగుతోందిమాజీ మంత్రి ఆర్కే రోజా గురించి చెప్పనవసరం లేదు. సినిమాల ద్వారా ఆమె అందరికీ సుపరిచితురాలు. రాజకీయాల్లోకి వచ్చాక నిత్యం వార్తల్లో నిలిచేవారు. గట్టిగా ఉంటూనే తెలుగుదేశం పార్టీలో ప్రవేశించారు. కానీ అక్కడ సరిగ్గా రాణించలేకపోయారు. రెండుసార్లు టిడిపి తరఫున పోటీ చేసి ఓడిపోయారు. అయితే రాజశేఖర్ రెడ్డి ద్వారా కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకున్నారు. ముఖ్యమంత్రిగా ఉండగా ఆయనను కలిశారు. అయితే కొద్ది కాలానికి రాజశేఖర్ రెడ్డి ప్రమాదంలో చనిపోయారు. దీంతో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లకుండా జగన్ స్థాపించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో తన చిరకాల వాంఛ అయినా ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2019లో రెండోసారి గెలిచి మంత్రి కూడా అయ్యారు. 2024 ఎన్నికల్లో ఓడిపోయారు. అయితే ఇప్పుడు సొంత పార్టీ నేతలు నగిరి నియోజకవర్గంలో తనను ఇబ్బంది పెడుతున్నారని అధినేత జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కానీ జగన్ పట్టించుకోకపోవడంతో ఇప్పుడు తాడేపల్లి కార్యాలయం వైపు కూడా రావడం మానేశారు.రాజకీయంగా అదృష్టం అంటే మాజీమంత్రి విడదల రజినీది ఎందుకంటే పోటీ చేసిన తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఎమ్మెల్యే అయిన తొలిసారి మంత్రి పదవి కూడా చేపట్టారు. దీనికి ముమ్మాటికీ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన స్వేచ్ఛ, అవకాశం కారణం. అప్పటి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అనుచరురాలుగా, ద్వితీయ శ్రేణి నాయకురాలిగా ఉండేవారు రజని. కానీ ఏకంగా జగన్మోహన్ రెడ్డి ఆమెను పార్టీలోకి ఆహ్వానించి టికెట్ ఇచ్చారు. మంత్రి పదవి కూడా కల్పించారు. ఆమెపై వ్యతిరేకత ఉందన్న కోణంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పంపించి టికెట్ కేటాయించారు.

# రెమ్యునరేషన్ లేకుండా సినిమా



సినిమా కళాత్మక వ్యాపారం. ఇక్కడ తారలు తమ ఇమేజ్‌ను బట్టి పారితోషికాల్ని డిమాండ్ చేస్తుంటారు. ఇక అగ్ర తారలైతే రెమ్యునరేషన్ విషయంలో ఏమాత్రం రాజీపడరు. కానీ ఈ ధోరణికి భిన్నంగా అగ్ర కథానాయిక తమన్నా 'ఓ రోమియో' అనే హిందీ సినిమాలో అతిథి పాత్రలో నటించినందుకుగాను ఎలాంటి పారితోషికాన్ని తీసుకోలేదట. ప్రస్తుతం ఈ విషయం బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. షాహిద్‌కపూర్, త్రిప్తి డిమ్రి జంటగా నటించిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రచార కార్యక్రమాల సందర్భంగా దర్శకుడు విశాల్ భరద్వాజ్ రెమ్యునరేషన్ల అంశం గురించి మాట్లాడారు. కథానాయిక తమన్నా, 12th ఫెయిల్' ఫేమ్ విక్రాంత్ మస్సే ఈ సినిమాలో అతిథి పాత్రల్లో నటించారని, తనతో ఉన్న స్నేహసంబంధాలతో పాటు ఓ మంచి కథకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో వారిద్దరూ పైసా పారితోషికాన్ని తీసుకోకుండానే నటించారని, ఈ రోజుల్లో అంతటి ఉదార స్వభావం ఉన్న వారు అరుదని ప్రశంసించారు.

గెస్ట్‌రోల్ కోసం కొన్ని రోజులే కేటాయించినా.. ఇప్పుడున్న వ్యాపార దృక్కోణంలో ఉచితంగా నటించడం గొప్ప విషయమని బాలీవుడ్ వర్గాలంటున్నాయి. గత ఏడాది వచ్చిన 'ఓదెల-2' తర్వాత తెలుగులో తమన్నా మరే చిత్రానికి సైన్ చేయలేదు.

# శాకుంతలం గట్టి దెబ్బనే కొట్టింది



భారీ చిత్రాలను సమర్థవంతంగా తెరకెక్కించగల దర్శకుల జాబితాలో గుణశేఖర్ కనిపిస్తారు. జానపదాలు .. పౌరాణికాలపై కూడా ఆయనకి మంచి పట్టుంది. అందుకు నిదర్శనంగా ఆయన రూపొందించిన రుద్రమదేవి .. శాకుంతలం సినిమాలు కనిపిస్తాయి. అనుష్క ప్రధానమైన పాత్రగా ఆయన రుద్రమదేవిఁని తెరకెక్కిస్తే, సమంత ప్రధానమైన పాత్రగా శాకుంతలం ఆవిష్కరించారు. 2023లో శాకుంతలం సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రీసెంటుగా ఒక ఇంటర్వ్యూలో గుణశేఖర్ మాట్లాడుతూ .. రుద్రమదేవి సినిమా వలన నాకు నష్టాలు రాలేదు. ఆ సినిమా వలన నాకు ఎలాంటి అప్పులు కాలేదు. కానీ శాకుంతలం మాత్రం గట్టి దెబ్బనే కొట్టింది. ఈ సినిమా ఓటీటీ వైపు నుంచి ఇబ్బంది పెట్టలేదు గానీ, థియేట్రికల్ వైపు నుంచి దెబ్బకొట్టింది. ఈ సినిమా వలన దిల్ రాజు గారు .. నేను ఇద్దరం కూడా సమానంగా రిస్క్ ఫేస్ చేయవలసి వచ్చింది. రావాల్సింది రాకపోవడం వలన ఇబ్బంది పడ్డాము అని అన్నారు. శాకుంతలం సినిమాపై వచ్చిన ఎమోంట్ తో నేను తీర్చవలసినవి కొన్ని ఉన్నాయి.

ఆ సినిమా ఆ అవకాశం ఇవ్వకపోవడం వలన, తీర్చవలసినవి ఇప్పటికీ అలా కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఎంతో కొంత అప్పు ఉంటేనే బెటర్ అని నేను అనుకుంటూ ఉంటాను. లేదంటే రిలాక్స్ అవుతామనే భయం నాకు ఉంది. అందువలన నేను పూర్తిగా సేఫ్ జోన్ లోకి వెళ్లకుండా, కొంత రిస్క్ చేస్తూనే ఉంటాను.. అని అన్నారు.

# బాలకృష్ణపై నటి లయ ఆసక్తికర కామెంట్స్..!

అమాయకమైన చిరునవ్వు, చక్కని నటనతో నటి లయ ఆ రోజుల్లో కుర్రకారు మనసు గెలుచుకున్నారు. అచ్చ తెలుగు అమ్మాయి అయిన లయ ఆ తర్వాత పెళ్లి చేసుకుని అమెరికాలో సెటిల్ అయిపోయారు. ఇప్పుడు చాలా ఏళ్ల తర్వాత నటిగా ఆమె తన సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టారు. హీరో శివాజీ, లయ జంటగా రూపొందిన cసాంప్రదాయిని సుప్పిని సుద్దపూసనిc చిత్రం ఈ నెల 12 నుంచి స్ట్రీమింగ్ కాబోతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో లయ మాట్లడుతూ నటసింహం బాలకృష్ణ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బాలయ్య సినిమా cవిజయేంద్రవర్మcలో లయ హీరోయిన్ గా నటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా సమయంలో బాలకృష్ణతో ఏర్పడిన అనుబంధాన్ని ఆమె పంచుకున్నారు. బాలయ్యగారు సెట్లో ఉంటే ఆ ఎనర్జీ వేరుగా ఉంటుందని లయ అన్నారు. ఆయన ఎంతో డిసిప్లిన్ గా ఉంటారని, అదే సమయంలో సహ నటీనటులతో ఎంతో సరదాగా జోకులు వేస్తూ అందరినీ నవ్విస్తుంటారని చెప్పారు. ఆయనతో కలిసి నటించడం తనకు దక్కిన గౌరవం అని అన్నారు. అవకాశం వస్తే మరోసారి ఆయనతో కలిసి నటించాలనేది తన కోరిక అని చెప్పారు. లయ కోరికను ఏ దర్శకుడైనా నెరవేరుస్తారేమో వేచిచూడాలి.






# 'వారణాసి'తో వరల్డ్ సినిమా లక్ష్యం..


## రాజమౌళి మహేష్ బాబు ప్రాజెక్ట్‌లో మరో షాకింగ్ ఎలిమెంట్!




దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కలయికలో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి' పై అంచనా లు రోజురోజుకీ పెరుగుతున్నాయి. భారతీయ సినిమాను అంతర్జాతీ య స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో రాజమౌళి ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్నారు. హాలీవుడ్ ప్రమాణాలకు తగ్గ సాంకేతిక విలువలు, కథనంతో ఈ సినిమాను నిర్మించనున్నట్లు ఇప్పటికే ఇండస్ట్రీ వర్గాల్లో బలమైన చర్చ నడుస్తోంది. సుమారు రూ.1300 కోట్లకు పైగా బడ్జెట్‌తో 'వారణాసి'ను రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇది భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్ట్ లలో ఒకటిగా నిలవనుంది. ఈ సినిమాను పూర్తిగా ఫార్మాట్లో చిత్రీకరి స్తుండటం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుని, ఈ చిత్రాన్ని అనేక భాషల్లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా ప్రియాంక చోప్రా నటిస్తున్న విషయం తెలిసిందే హాలీవుడ్ అనుభవం ఉన్న ప్రియాంక పాత్ర సినిమాకు అంతర్జాతీయ ఆకర్షణను తీసుకురానుంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరో ఆసక్తికర విషయం బయటకు వచ్చింది. మహేష్ బాబు పాత్రతో పాటు సినిమాలో ఒక స్పెషల్ నెగటివ్ క్యారెక్టర్ కూడా ఉండబోతుందని, ఆ పాత్రకు ఓ ప్రముఖ బాలీవుడ్ నటుడు ఎంపికైనట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఈ పాత్ర కథలో కీలక మలుపులు తిప్పేలా ఉంటుందని సమాచారం. 'వారణాసి'కి రాజమౌళి రెగ్యులర్ టీమ్ పని చేస్తుండటం సినిమాపై నమ్మకాన్ని మరింత పెంచుతోంది. మూవీకి ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తుండగా, కథ విజయేంద్ర ప్రసాద్ అందించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ దేశవ్యాప్తంగా విశేష స్పందనను తెచ్చుకుంది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మహేష్ బాబు లుక్ అన్ని కలిపి సినిమా స్థాయిని పెంచాయి. 'బాహుబలి', 'ఆర్‌ఆర్‌ఆర్'తో భారతీయ సినిమాను ప్రపంచ పటంలో నిలిపిన రాజమౌళి, ఇప్పుడు 'వారణాసి'తో ఆ స్థాయిని మరింత పెంచాలని చూస్తున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే ఇది అత్యంత భారీ, డిఫరెంట్ ప్రాజెక్ట్‌గా మారనుంది. ఇంకా పూర్తి వివరాలు బయటకు రావాల్సి ఉన్నా, ఇప్పటివరకు వచ్చిన అప్డేట్స్ చూస్తే 'వారణాసి' కేవలం సినిమా కాదు.. ఒక గ్లోబల్ ఈవెంట్ అవుతుందని చెప్పడంలో సందేహం లేదు.

## క్రేజీ సీక్వెల్ 'ఆవేశం 2' వచ్చేస్తుంది..

# పుష్ప యాక్టర్ ఫహద్ ఫాసిల్ ఏం చెప్పాడంటే..?



తెలుగు ప్రేక్షకుల్లో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న మాలీవుడ్ స్టార్ హీరోల్లో టాప్‌లో ఉంటాడు ఫహద్ ఫాసిల్. ఈ క్రేజీ యాక్టర్ నటించిన మాలీవుడ్ యాక్షన్ కామెడీ డ్రామా ఆవేశం.రోమాంచం ఫేం జీతూ మాధవన్ డైరెక్ట్ చేశాడు. సుమారు రూ.30 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. ఈ చిత్రంలో ఫహద్ ఫాసిల్ పోషించిన రంగ పాత్రకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.కాగా ఈ క్రేజీ చిత్రానికి సీక్వెల్ రాబోతుందన్న వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. తాజాగా ఓ ఈవెంట్‌లో సీక్వెల్‌పై క్లారిటీ ఇచ్చాడు ఫహద్ ఫాసిల్. ఆవేశం 2 ఉంటుందని అధికారికంగా ప్రకటించాడు. సీక్వెల్ 2027 లేదా 2028లో మొదలు కానుందని కూడా క్లారిటీ ఇచ్చాడు. డైరెక్టర్ జీతూ మాధవన్ సూర్యతో చేస్తున్న తన తొలి తమిళ చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ మూవీతోపాటు ఫహద్ ఫాసిల్ కమిట్ మెంట్స్ పూర్తయిన తర్వాత ఆవేశం 2 సెట్స్‌పైకి వెళ్లనుందట. మొత్తానికి పుష్ప యాక్టర్ అభిమానులు, మూవీ లవర్స్‌కు ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి.ఓ వైపు ఫహద్ ఫాసిల్ అండ్ టీం కామిక్ టైమింగ్.. మరో యాక్షన్ ఎలిమెంట్స్‌తో సాగే ఆవేశం చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న ఆవేశం 2 అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఆవేశం చిత్రాన్ని ఫహద్ ఫాసిల్-నజ్రియా నజీమ్, అనన్ రషీద్ సంయుక్తంగా నిర్మించారు.

# సిద్ధూ జొన్నలగడ్డ కొత్త చిత్రం

## డైరెక్టర్ ఆర్ఎస్‌జెతో మూవీ

టాలీవుడ్ స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ కొత్త సినిమాను ప్రారంభించాడు. శనివారం ఫిబ్రవరి7 ఆయన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. ప్రస్తుతం సరైన హిట్లు లేక సతమవుతున్న సిద్ధు తన తదుపరి చిత్రాన్ని దర్శకుడు స్వరూప్ ఆర్ఎస్‌జే (ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ ఫేమ్) తో చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం 'ప్రొడక్షన్ నెం. 40'గా పిలుస్తున్న ఈ సినిమాకు సంబంధించి త్వరలోనే మరిన్ని వివరాలను చిత్రబృందం వెల్లడించనుంది. సిద్ధు తనదైన శైలిలో మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారని ఈసారి బాక్సాఫీస్ వద్ద బ్లాస్ట్ ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తూ సిద్ధుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది.




Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215